
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!
'గురువు'
అన్న పదంలో బ్రతుకుతున్నామా?
'గురుపదం'లో
జీవిస్తున్నామా?
గురుకృప
గురుపూర్ణిమ సంచిక



## శిరిడీలో మనం ఎలా ఉండాలి?

**గురుబంధువు :** గురువుగారూ! మేము ఎక్కువగా దర్శించే క్షేత్రం శిరిడీ. శిరిడీలో ఎలా ఉండాలి? ఏం చేసుకోవాలి? అందరూ శిరిడీలో మాయ అనేది ఉంటుంది. అది మిమ్మల్ని మోసం చేస్తుంది. దాన్ని గుర్తుపెట్టుకొని వర్క్ చేసుకోవాలి అని అంటారు. అసలు నిజంగా మాయ అనేది ఉందా?

**గురువుగారు :** మాయను గుర్తుపెట్టుకోవడం కంటే బాబాను గుర్తుపెట్టుకోండి. సరేనా?

**గురుబంధువు :** గురువంటే దైవం కదా సార్! ఆయనను ఎలా ఆశ్రయించి ఉండాలి? ఆయన మీద ఎట్లా ఆధారపడి ఉండాలి? అది కొంచెం వివరించండి.


**గురువుగారు :** ఒక పసిబిడ్డ అమ్మానాన్నల మీద ఎట్లా ఆధారపడి ఉంటుందో అట్లా ఆధారపడి ఉండాలి. దానికి ఆశ్రయించుకోవడం అనే పదం వాడరు. మనం మామూలుగా, మనకు ఆనందం ఎన్నో రకాల ద్వారా వస్తుందని అనుకుంటాం. అందుకని డబ్బు, ఉద్యోగం అని, ఇట్లా రకరకాలుగా మనం ప్రయత్నం చేస్తాం. కానీ ఎవరైనా ఒకరి యొక్క సన్నిధిలోకి వెళ్ళినపుడు ఇవేవీ కారణాలు కాకుండా, మనకు లోపల ఒక అద్భుతమైన ఆనందం కలుగుతుంది. అది ఎందుకు కలుగుతోంది అనేది మనకు తెలియదు. దానికి కారణాలు ఇదీ అని చెప్పలేం. ఆయన్ని చూస్తూ ఉంటే లోపల ఒక ఆనందం కలుగుతుంది. మనస్సుకు శాంతి వస్తుంది. ఒక నిశ్చింత వస్తుంది. ఎక్కడైతే ఏ రూపాన్ని చూస్తే మనకు ఆ నిశ్చింత కలిగిందో, ఆ రూపం మన సద్గురువు. ఆ నిశ్చింతను పెంచుకోవడమే మనం చేసేటువంటిది. ఆ నిశ్చింత కలిగింది కనుక. మనకు ఆయనపట్ల ప్రేమ కలుగుతుంది. ఆ ప్రేమను ఇంకా ఇంకా వృద్ధి చేసుకోవడమే చెయ్యాల్సింది. దానికి వేరే మార్గమేమీ లేదు. ఒకొక్కరికీ ఒక్కో మార్గముంటుంది. సందర్భాన్ని బట్టి. అట్లా మనం ప్రేమించేటువంటి రూపం ఉండే ప్రదేశానికి వెళ్ళినపుడు మన మనస్సు దాని మీదా, దీనిమీదా పోకుండా ఆ ప్రేమను అనుభవిస్తూ ఉండటమే శిరిడీలో ఉండి చెయ్యాల్సింది. అక్కడ మాయ ఉంటుంది. అది మోసం చేస్తుంది. మాయ ఉండేది శిరిడీలో కాదు, మనలో.

సంపుటి : 27
సంచిక : 3



గురుపూర్ణిమ సంచిక
21 జూలై 2024

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. – శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



పథగామి – గురుకృప 4

మౌంటెన్ పాత్‌లో నాన్నగారు – Ram Brown Crowell 8

14 గురుదేవుల అనుగ్రహభాషణం – సాయిపథం

20 విధానం లేని దానం – గురుకృప

22 గురుకృపాలహరి – గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

గురువుతో సాంగత్యంలో జీవుడు సత్పురుషుడిగా పరివర్తన చెందుతాడు. పారాయణ... బాబా చరిత్ర చదువుతున్నపుడు, అందులో ఉన్న వారు మన పెద్దలుగా, భాగవతమూర్తులుగా భగవానుడైన బాబా చేత ఎలా కీర్తింపబడ్డారో, ఎంతగా కీర్తింపబడ్డారో అన్న భావం మనలో కలిగి, అలా కదా మనం ఉండాల్సింది అన్న స్ఫూర్తి రగిలి, మార్గాన్వేషణలో ఆ భాగవతమూర్తులందరూ ఒక్కొక్కరుగా మన అంతరంగంలో సాక్షాత్కరించి, అనన్యభక్తి మార్గాన నడవదలచిన వారికి అలవడవలసిన (మహా "భూ భవస్య" అనే మూడు లోకాలు దాటి మహర్లోకంలో ఉన్నవాడు అని అర్థం) లక్షణాలను గూర్చి దివ్యమైన పద్ధతిలో ఎలా ఉపదేశిస్తూ వచ్చారో గోచరమై అనుభూతికంది, ఆ వైపుగా అడుగువేసే ప్రయత్నంలో మనం అనుభవం పొంది, పంచాలి. మన వాళ్ళు అందించినది అదే కదా! మన అనుభవాన్ని పంచుకుంటూ అందించాల్సింది ఇది కదా! అందరూ భాగవతమూర్తులే! అందరూ ఆ దేవదేవునికి సర్వసమర్పణ చెందినవారే! ఆ సర్వసమర్పణ స్థితిలో వారుండగా వారి జీవితాలలో, జీవిత సన్నివేశాలలో ఎలాంటి దివ్యగుణాలు వ్యక్తమవుతూ వచ్చాయో మనం దర్శించాలి.

కుంతీదేవి... తనను తరిమికొట్టినవాళ్ళే, తన చెంత దీనులై నిలిచిన వేళ, తన ఆశ్రయంలో శేష జీవితాన్ని వెళ్ళబుచ్చుకునే స్థితిలో పడినవేళ, సుఖభోగాలు తనను చుట్టుముట్టినవేళ, రాజమాత పదవి తనను కోరి వరించినవేళ, అంతటి విజయాల మధ్య నుండి ఆమె ఏమంటున్నది? "కన్నయ్యా! ఇక నా కర్తవ్యమేమిటి?" అంటున్నది. "ఇన్నింటి మధ్యలో ఉన్న నన్ను నీ సంకల్పానికి అనుగుణంగా నడిపించు ప్రభూ!" అని కోరుతున్నది. సుఖభోగాలను అనుభవించడంలో కన్నా, నీ సంకల్పానికి అనుగుణంగా ప్రవర్తించడంలోనే నాకు నిజమయిన సుఖమున్నది అంటున్నది. ఇది ఆవిడలో వ్యక్తం అవుతున్నది. ఇది దర్శించడం మనం చేయవలసింది.

కష్టనష్టాలు ఆమె ప్రయాణాన్ని ఆపలేవు. సుఖభోగాలు ఆమె ప్రయాణాన్ని అడ్డుకోలేవు. ఆశ్చర్యం కదూ! లోకంలో ఈ రెండింటి పేరనే మనిషి కర్తవ్య నిర్వహణ నుండి చెదిరిపోతాడు. ఇంకా చెప్పాలంటే కర్మ భ్రష్టుడయిపోతాడు. "కష్టనష్టాలు వస్తున్నాయి. కష్టనష్టాలు కమ్ముకు వస్తున్నాయి. ఇంక నేనేం చేయగలను. మీరే చెప్పండి!" అంటాడు. సుఖభోగాలు చేరవస్తున్నాయి. సుఖభోగాలు



ఇన్నాళ్ళకు నా జీవితంలో అందివస్తున్నాయి. వీటిని తగుమాత్రంగానయినా అనుభవించకుండా నేనెలా ముందుకు సాగగలను! మీరే చెప్పండి" అని అంటున్నాడు. అంటే దానర్ధం ఏమిటి? కష్టసుఖాలు వస్తే అతడిక కదలలేడు. సుఖభోగాలు వస్తే ఇక సాగలేడు. మరి ఇంకెప్పుడు కదులుతాడు. కష్టనష్టాలు వచ్చినా, సుఖభోగాలు హెచ్చినా, మనం మాత్రం ఉండవలసింది కర్తవ్య నిర్వహణలోనే! కష్టనష్టాల మధ్య నుండి మనం కర్తవ్యం వైపుకే చూడాలి! సుఖభోగాల మధ్య నుండి మనం కర్తవ్యం వైపుకే చూడాలి (ఒకే ధ్యేయం) కర్తవ్య నిర్వహణలోనే కదా సుఖమున్నది! ఆ కర్తవ్య నిర్వహణ ఆ దేవదేవుని సంకల్పానికి అనుగుణంగా సాగినపుడే కదా సుఖమున్నది. కష్టనష్టాలయినా కర్తవ్య నిర్వహణకు దోహదాలే! సుఖభోగాలయినా కర్తవ్య నిర్వహణకు సోపానాలే! ఎంత చక్కగా చెప్పిందామె! వాటిని చూచి ఆగవద్దు అంటున్నది (నీ లక్ష్యం చేరే వరకు ఆగవద్దు, ఆపవద్దు. చివరికంటా ఆ పనిని చేయి – శ్రీసాయిబాబా) వాటి మధ్యగా సాగిపోమంటున్నది. కర్తవ్యనిర్వహణకు వాటిని దోహదాలుగా, సోపానాలుగా స్వీకరిస్తూ కదలిపోమంటున్నది. ఏమి సందేశం! శ్రీకృష్ణుని గీతాబోధ ఇలా కుంతిగా, ఆ కుంతి జీవితంగా రూపుకట్టుకున్నట్లు గోచరించడం లేదూ! గీత అర్ధం కావాలీ అంటే కుంతి అర్ధం కావాలి. ఆమె నడిచిన 'గీత' జీవిత రూపంలో నడిచిన భగవద్గీత! ఎలాంటి దివ్య గుణాలను అలవరచుకోవాలో, ద్రౌపదీ, ఉత్తర చెబుతూ ఉంటే, ఆ దివ్య గుణాలను అలవరచుకుంటూ కర్తవ్యం వెంట ఎలా సాగిపోవాలో కుంతీదేవి జీవనం ఉపదేశిస్తున్నది. భాగవత మార్గాన నడువదలచినవారు కర్తవ్యపథాన కడదాక ఎలా సాగిపోవాలో సూచిస్తున్నది ఆమె, చూపిస్తున్నది ఆమె.

'పగవారికయినా ఈ బాధ కలగవద్దు' అని అనుకుంటూ ఉంటాం మనం చాలాసార్లు. అంటే ఏమిటో అలా అనుకోవడంలోని పరమార్ధమేమిటో నరజాతికి ఉపదేశించింది మహాసాధ్వి ద్రౌపది. ఆమె నుండి అనితర సాధ్యమైన క్షమాగుణం వ్యక్తమైంది. తన వంశాన్నే నిర్వంశం చేయడానికి నడుం కట్టిన దుర్భర శత్రువుని క్షమించగలిగిందామె. నా వంటి స్థితి ఇంకెవరికీ కలుగకూడదు. చివరకు మీ తల్లికయినా! అని అశ్వత్థామతో అనగలిగిందామె. భగవత్ భక్తుల బాటన నడువదలచిన ఓ సాధకులారా! సహృదయులారా! ముందుగా ఈ క్షమాగుణాన్ని, ఇలాంటి క్షమాగుణాన్ని మనం అలవరచుకోవాలి సుమా! ఇతరులు మనకు ఏమి చేయకూడదనుకుంటున్నామో, మనం దానిని ఇతరులకు చేయకూడదు. చివరకు మనపట్ల అలా చేసిన వారికి కూడా మనం అలా చేయకూడదు



– అన్న దివ్య సందేశాన్ని, మహోన్నతమయిన (దివ్యత్వ) స్థితిలో నుండి మానవజాతికి అందిస్తున్నదామె.

దివ్యప్రేమ... ఉత్తర, అమృతమూర్తి! ఆమె ప్రవర్తన మనకేమి తెలియచెబుతున్నది? భాగవత మార్గాన నడువదలచినవారు తమను తాము మరచిపోవాలని! తమ చుట్టూ ఉన్నవారికోసం, తమను ఆశ్రయించుకొని ఉన్న వారి కోసం తమని తాము సమర్పించుకోవాలని! ఎంతటి ఉపదేశమది! ఆమె ఏమన్నది దేవదేవునితో! నా కడుపులోని బిడ్డ అస్త్రాగ్నికి ఆహుతైపోతున్నాడు. రక్షించు ప్రభూ! అతడిని రక్షించు! అన్నది. మరి అస్త్రాగ్ని ఆమెను దహించివేయడం లేదా! ఆ ప్రసక్తి అక్కడ లేనే లేదు! ఉండదు! ఎందుకని! ఆమెకు ఆమె గుర్తు లేదు కనుక! తనకు తాను గుర్తుండి, తన కొరకు తాను వెంపర్లాడే సాధారణ స్థితి నుండి ఆమె ఎప్పుడో ఈవలకు వచ్చింది కనుక! ఆమె అలా అనలేదు. (కొలిమిలో పడబోతున్న బిడ్డ లీల–చేయి కాలితే కాలింది, బిడ్డ రక్షించబడింది – శ్రీసాయి) ఆయా సంఘటనల ద్వారా క్షమ అంటే ఇదీ అని ద్రౌపది, ప్రేమ అంటే ఇలా ఉంటుందని ఉత్తర, కడదాకా కర్తవ్యం వెంట కదలి సాగడమెలాగో తెలియచెబుతుంది కుంతీదేవి... కృష్ణ భగవానుడు నా వారు అలా నాలా ఉంటారు అని చూపుతూ తెలియచెబుతున్నాడు (తండ్రికి తగ్గ బిడ్డలు కండి – శ్రీసాయి)

**శబరి:** తన గురువైన మాతంగ మహర్షి చెప్పిన మాటను ఎంతగా అంటిపెట్టుకున్నది, శబరి తన గురువు చెప్పిన మాటను పాటించడంలోని సహనం, విశ్వాసాలతో ఆరాధన వ్యక్తం అవుతున్నాయి. వాటిని మనం దర్శిస్తే, అవే ఆవిడ చెంతకు రాముడు వచ్చేలా చేసాయి అన్నది అవగతం అవుతుంది. ఇట్టి దర్శనాదులతో మన కర్తవ్యం బోధపడ, మార్గం సుగమమై, గమ్యం వైపు అడుగులు వేయగలం. రమారమి 12 సం॥ల తరువాత శ్రీరామ దర్శనమయిన వేళ శబరిని తన సాధన ఫలవంతమయినదా? అని కుశల ప్రశ్నలడిగి శ్రీరాముడే మాతంగ ముని ఆశ్రమాన్ని చూపమని కోరతాడు. రామునికి కూడా ఆ భక్తగిరి శబరి తమ గురువుల గొప్పతనాన్ని వర్ణించి గురుసన్నిధిని ఎంత త్వరగానో చేరాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తుంది. సద్గురు సన్నిధి విలువ సంపూర్ణంగా తెలిసిన శ్రీరామచంద్రుడు శబరి ఆకాంక్షను నెరవేర్చుకునే అవకాశాన్ని ప్రేమగా అంగీకరిస్తాడు. సద్గురువాక్యం పట్ల నిబద్ధతకు పెట్టనికోట శబరి.



**రామానుజులు :** తన గురువు ఇచ్చిన మంత్రాన్ని అందరికీ చెప్పడంలో, ఆ మంత్రం పంచుకోవడంలో అతని హృదయ స్థితి గురువు హృదయస్థితి. తాను పొందినది అందరూ పొందాలనే సహృదయం గురువుది (తండ్రికి తగ్గ బిడ్డలు కండి – శ్రీసాయి)

మనిషి దైవంగా ఎదగడం బాబా మతం... సద్గ్రంథం చదివాం.. జీవిత కురుక్షేత్రంలో ఆ సద్గ్రంథం అనే జ్యోతిని చేతబట్టుకొని జీవన రహదారి వెంట అడుగులు వేస్తూ అంతర్మథనం ద్వారా జిజ్ఞాసువులమై జీవిత సారాంశాన్ని (ఎందుకీ జీవితంలోకి వచ్చింది – శ్రీసాయిబాబా) పొంది, అనుగుణవర్తనంతో జీవనసారాన్ని ఆస్వాదించి ముముక్షత్వంలో  ఆధ్యాత్మికత, మానవీయత పరస్పరం పెనవేసుకొని జీవనంలో ఒకటిగా సహజంగా వ్యక్తం అవుతుంది. (మానవత్వానికన్నా మించింది కాదు జ్ఞానం – శ్రీబాబూజీ)

మహాత్ముడు గడిపిన నిరాడంబర జీవితం. దినచర్యలో నియమనిష్ఠలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత, కర్తవ్య నిర్వహణలో ఆయన చూపిన దక్షత, వారి ఆదర్శం మనకు మార్గదర్శకం కావాలి. నా అవసరం ఎక్కడుంటే అక్కడుంటాను. మీ అవసరం ఎక్కడుంటే అక్కడుంచుతాను అన్నది గురువాక్యం. గురువు ఎక్కడ బావుంటుందో అక్కడ ఉండరు. ఎక్కడ బాగుకావాలో అక్కడ ఉంటారు. మనం కోరినపుడు దొరకరేమోగాని మనకవసరమైనపుడు పిలవకుండానే ప్రక్కన ఉండి నడిపిస్తూ, అవసరమైతే మందలిస్తూ ఉంటారు.

**గురువు మాట శిరోధార్యం, వేదవాక్యం :** శిష్యుడు–గురువు చేయు పనిని నిశితదృక్కులో చూచి, సునిశిత మేధస్సుతో తూచి, ఇంకను సునిశితమైన వాక్కుతో ఎల్లరకు తెలియచేయ యత్నించుచు తన చేతితాయమును నలుగురికి పంచవలెనని తహతహపడువాడు. వరణీయుడైన దైవభక్తుడు. 'బహుజన హితాయ బహుజన సుఖాయ' సాయిపథంను ప్రాణం కంటే ఎక్కువగా పదిలపరచుకున్నవారు – శ్రీబాబూజీ

జగత్‌కళ్యాణ కార్యం గురువు అవతార, అవతరణ పరమార్థం. గురువు ఆదర్శమునకు ఆచరణకు అభేదము. వారి జీవనము ఇహపర శ్రేయమునకు దీక్ష పూనినవారు. మన మధ్య మసలుతున్న పరతత్వ ప్రతీకగా అనన్యులు. గురువు ఆధ్యాత్మికతకు – ఆత్మీయతకు చక్కని వంతెన.గురువు ఆయనకు తెలిసినది మనకు చెప్పరు. మనకు తెలియవలసినది చెప్తారు. 'సొంతంగా చెప్పాలన్న మోజు లేదు, చెప్పవలసినది సొంతంగా చెప్పాలన్న దీక్ష' ఉన్న వారు గురువు. గురువు – మన స్థాయికి దిగివచ్చి తన స్థాయికి మనలను కొనిపోతారు.



జగముల లాలించు జగన్మోహన రూపా!
త్రిజగముల పాలించు త్రిజగన్మోహన రూపా!
సర్వలోకాల నేలేటి సర్వవ్యాపకా...
పరమార్థ మొసగుమా! సద్గురురాయా!
మనుగడ లేని మానవులకు మార్గము చూపిన మహానుభావా!
కనికరంబున మా కరము బట్టి గమ్యం చేర్చు కరుణా సముద్రా!
జ్ఞాన విజ్ఞాన సుజ్ఞాన స్వరూపా! గురుదేవా!

– గురుకృప

## మౌంటెన్ పాత్‌లో నాన్నగారు

1989వ సంవత్సరంలో తమ గురువైన శ్రీభరద్వాజ గారు మహాసమాధి చెందిన వెంటనే, గురువుగారు తమ నివాసాన్ని శ్రీసాయిబాబా సమాధి స్థానమైన శిరిడీకి మార్చారు. ఒంగోలులో తాము స్థాపించిన పాఠశాల నుండి లభించే గౌరవ వేతనంతో వారి కుటుంబ (భార్య, కుమార్తె) పోషణ సాగేది. నెమ్మదిగా, ఆయన దివ్యసన్నిధి ప్రభావం, భక్తులను ఆయన వైపు ఆకర్షించసాగింది. అలా వచ్చిన భక్తుల అవసరాలు మరియు ప్రశ్నలకు పరిష్కారంగా బాబా పట్ల వారికున్న ప్రేమను పంచుతూ, వారి సమస్యలు తీరడానికి సహాయం చేస్తుండేవారు. ఆయన సన్నిధి ఎంతో ప్రశాంతతను, వారి సహాయం ఎంతో ప్రభావశాలిగా ఉండటంతో భక్తులు ఆయనను ప్రేమతో గురూజీ అని పిలవడం ఆరంభించారు. అయితే తాను గురువునని చెప్పటం కానీ, అందరూ అలా గుర్తించాలని కానీ ఆయన ఎప్పుడూ భావించలేదు. ఆయన పొందిన ఆధ్యాత్మిక స్థితి యొక్క ఫలాలు ప్రకటం కావటం మొదలై, ఆయనను దర్శించాలని అభిలషించే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో, వారి అవసరాలకు అనుగుణంగా భక్తులందరూ వారిని దర్శించుకునేందుకు వీలుగా ఒక సత్సంగహాలు నిర్మించడం జరిగింది. గురువుగారు వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వటాన్ని కానీ, ఏవిధమైన ప్రచారాన్ని కానీ అనుమతించేవారు కాదు. పైగా విముఖత చూపేవారు. అయినా, వారి మహిమ అతి త్వరగా పెరుగుతూ, 1990 దశకం చివరి సంవత్సరాలలో, భారతదేశంలోని అన్ని ప్రాంతాలనుండి వేలాదిమంది భక్తులు ఆయన దర్శనానికై శిరిడీకి కానీ, లేక అప్పుడప్పుడు ఆయన ప్రయాణించే ప్రదేశాలకు కానీ తరలి వచ్చేవారు. 1998లో హైదరాబాదులోని ఒక సాయిబాబా మందిరంలో



శ్రీసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విచ్చేసిన 10,000 మందికి పైగా భక్తులకు వరుసగా నిరంతరాయంగా రెండు రోజులపాటు గురువుగారు పాదదర్శనాన్ని ప్రసాదించటం స్వయంగా గమనించిన నేను, నా కళ్ళను నేనే నమ్మలేక, ఎంతో ఆశ్చర్యంతో చూస్తుండిపోయాను.

దర్శనసమయంలో సాయిబాబా నామస్మరణ నిరంతరం జరుగుతుండగా, శ్రీసాయిబాబా నిలువెత్తు చిత్రపటం క్రింద, గురువుగారు కళ్ళుమూసుకొని, ధ్యానస్థులై కూర్చున్నపుడు, వేలాదిమంది భక్తులు అద్భుతమైన ఆయన ఆధ్యాత్మిక శక్తికి మంత్రముగ్ధులై, ఆయనను దర్శించుకునేవారు. దర్శనానికి ముందు, తరువాత వారు శ్రీసాయిబాబా చిత్రపటానికి నమస్కరించుకునేవారు. ఆ సందర్భంలో ఆయన ఎన్నడూ మాట్లాడేవారు కాదు. ఆధునిక భారతదేశంలో ఆవిష్కృతమయ్యే గొప్ప దర్శనాలలో ఇది ఒకటి. శ్రీసాయిబాబా పట్ల వారికి గల పరిపూర్ణమైన భక్తికి ఇది ఒక నిదర్శనం. గురువుగారి జీవితంలో ప్రకటమైన సత్యము, మరియు స్వచ్ఛతే దీనికి ప్రమాణము.

1993వ సంవత్సరంలో, మొదటసారిగా కొంతమంది విదేశీ భక్తులు వారి వద్దకు వచ్చారు, ఆ తరువాత శ్రద్ధాసక్తులు గల మరికొందరు పాశ్చాత్య సాధకులు తోడయ్యారు. ఈ భక్తులు క్రమేపీ గురువుగారి వద్దకు చేరిన పాశ్చాత్య గురుబంధువుల బృందానికి కేంద్ర స్థానంగా మారారు. అలా గురువుగారి దరిచేరిన సాధకుల నిజమైన అవసరాన్ని, గురువుగారి సాన్నిధ్యం కొరకై వారు పడే తపనను గమనించిన గురువుగారు, ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించిన వారి ప్రశ్నలకు సమాధానంగా ఆంగ్ల సత్సంగాల రూపంలో ప్రతిస్పందించేవారు. అలా సుమారుగా 140కి పైగా గురువుగారి ఆంగ్ల సత్సంగాలు రికార్డ్ చేయబడి, ఆ తరువాత అనువదించబడ్డాయి. గురువుగారు చివరగా చేసిన సత్సంగం, వారు మహాసమాధి చెందడానికి ఒక వారం రోజుల ముందు జరిగింది. 2010వ సంవత్సరం నవంబరు మాసంలో గురువుగారు మహాసమాధి చెందినప్పుడు, పాశ్చాత్య భక్తులు గురువుగారికి నివాళులు అర్పించడానికి, వారి భౌతిక వియోగంతో ప్రపంచవ్యాప్తంగా బాధాతప్తులైన భక్తుల దుఃఖాన్ని ఉపశమింపజేయడానికి ఒక మార్గాన్ని అన్వేషించారు. ఏదో ఒక అంశాన్ని తీసుకొని, గురువుగారు ప్రసాదించిన ఆంగ్ల సత్సంగాల నుండి దానికి సంబంధించిన కొన్ని భాగాలను క్రోడీకరించి, రోజ్ పెటల్స్ (శరశ్చంద్రికలు) పేరుతో ప్రతినెలా ఈ-మెయిల్



రూపంలో తీసుకురావాలని నిర్ణయించారు. శిరిడీలో గురువుగారి మహాసమాధి ఉత్సవాలు ముగిసిన ఆరువారాల తర్వాత 2011వ సంవత్సరం జనవరి నెలనుండి, ప్రతి నెలా ఎంపిక చేసుకున్న అంశానికి అనుగుణంగా సత్సంగ భాగాలను క్రోడీకరించి సంకలనం చేశారు. అలా ప్రతినెలా ఈ– మెయిల్ ద్వారా రోజ్ పెటల్స్ పంపించడం కొనసాగిస్తూ, 2012వ సంవత్సరం జనవరి నెలలో, క్రితం సంవత్సరం సంచికలన్నీ కలిపి "రోజ్ పెటల్స్ 2011" అనే గ్రంథరూపంలో ప్రచురించాలని నిర్ణయించారు. ఆ గ్రంథంలోని పరిచయంలో భాగమే ఈ వ్యాసము.

గురువుగారి సత్సంగాలలో ఒక అసాధారణమైన విశిష్టత కనిపిస్తుంది. ప్రశ్నించే సాధకుల పంథా ఏదైనప్పటికీ ఆధ్యాత్మిక, మానసిక సమస్యలకు అడిగేవారి అవసరాన్ని అనుసరించి ఆచరణాత్మకమైన సమాధానాలు లభించేవి. ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించి శ్రీబాబూజీ అనుసరించిన సమగ్రమైన పద్ధతి– సిద్ధాంతాలను, శాస్త్రాలను, సంప్రదాయపు విధానాలను కాకుండా వ్యక్తిగతంగా, వ్యక్తి అనుభవాన్ని ఆధారంగా చేసుకుని ఉండేది. **గురువుగారి జ్ఞానోదయపు వెలుగులతో నిండిన ఆయన పరిశీలనలు మానవులుగా సాధించగలిగిన పరిపూర్ణత్వాన్ని, ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించే హృదయ వికాసాన్ని మనం అర్థంచేసుకునేందుకు దోహదం చేస్తాయి.**

గురువుగారి సత్సంగాలు అనాదిగా సాధకులకు ఆసక్తి కలిగించే అనేక అంశాలను స్పృశిస్తాయి. ఉదాహరణకు, గురువుకు శిష్యునికి గల సంబంధం, లక్ష్యసాధనలో అనుగ్రహానికి, ప్రయత్నానికి గల సంబంధం, అనుగ్రహం, ప్రేమ, భక్తి, ధ్యానం, అహంకారం తీసుకునే రూపాలు, సంక్లిష్టతలు, సద్గురు బోధనలను రోజువారీ జీవితంలో ఎలా భాగం చేయాలి, ఇలా ప్రపంచంలోని ఎందరో సాధకులకు ఉపయుక్తమైన ఎన్నో ఇతర అంశాలు సత్సంగ సంభాషణలలో ఉన్నాయి. ఈ విషయాలపై గురువుగారి అభిప్రాయాల గురించి మరింత సమాచారం రోజ్ పెటల్స్ 2011 లో చూడవచ్చు, గురుదేవుల సత్సంగాలలోని ఒక అంశం ఇక్కడ ప్రస్తావించదగినది. శ్రీ రమణ మహర్షిపై వారు చేసిన వ్యాఖ్యానం. గురువుగారు తరచూ శ్రీ భగవాన్ గురించి మాట్లాడేవారు.

రమణులపట్ల వారికి గౌరవం, స్థిరమైన ప్రేమ చాలా స్పష్టంగా కనిపించేవి. రమణుల గురించి ఆయన చేసిన అనేక పరిశీలనల్లో రెండు ఇక్కడ ప్రస్తావించుకోవచ్చు. మొదటిది, చాలా మంది పాశ్చాత్యుల మాదిరిగా కాకుండా, గురువుగారికి భగవాన్ గురించి ఎక్కువ ఆసక్తి కలిగించినది



వారి బోధనలు కాదు, రమణుల జీవితం. "రమణుల జీవితం ముఖ్యం, ఆయన బోధనలు కాదు నన్ను మొదట ఆయన వైపు ఆకర్షించింది ఆయన జీవితం. ఇప్పటికీ కూడా, రమణులంటే ఆయన బోధనలు కాదు, ఆయన జీవితం. అది వాస్తవం. అందరూ వేదాంతం, గొప్ప వేదాంతం మాట్లాడవచ్చు, కానీ అలా జీవించడానికి నా దృష్టిలో, ఆయన బోధనలన్నీ ఆయన జీవితంతో పోలిస్తే అంత విలువైనవి కాదు. ఆయన బోధనలన్నిటికంటే నాకు రమణుడు ముఖ్యం, ఎందుకంటే ఆ బోధనలు మూర్తీభవించిన రూపం ఆయన. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, "మాటలు మాత్రమే ఎవరినీ మార్చవు" అనేవారు. "శంకరుని వంటి సద్గురువు శిష్యుడి చెవిలో మహావాక్యం ఉపదేశించడం వలన జ్ఞానోదయం పొందినట్లు ఉపనిషత్తుల్లో రుజువులు ఉన్నాయి వాటి సంగతేమిటి?" అని నేను అడిగినప్పుడు. దానికి గురువుగారు, "మహావాక్యం అంటే గురువాక్యం", అవి కేవలం వాక్కు (మాట) మాత్రమే కాదు, అదో అనుభవం. కేవలం మాటలు మాత్రమే ఎవ్వరినీ మార్చలేవు. గురువు యొక్క మహత్వం మారుస్తుంది, కేవలం వాక్యం మార్చదు. అందుకే వాటిని మహావాక్యాలు అన్నారు. నేను ఇంకా కాస్త ప్రశ్నించినపుడు, గురువుగారు ఇలా అన్నారు, మహా అన్నది గురువుయొక్క పరివర్తనాత్మకమైన అనుగ్రహం, మౌలికంగా మార్చే అదే మాటలు అనుగ్రహానికి వాహకాలు మాత్రమే. ఈ సందర్భంగా భగవాన్ చెప్పిన మాటలను ఇక్కడ గుర్తుచేసుకోవడం సముచితం. 'జ్ఞానికి సంకల్పాలు ఉండవు, కానీ అతని సన్నిధి అత్యంత శక్తివంతమైన బలాన్ని కలిగి వుంటుంది. ఇది అద్భుతాలు చేయగలదు. ఆశ్రితులను రక్షిస్తుంది, మనశ్శాంతిని ఇస్తుంది, సంసిద్ధులైన వారికి మోక్షాన్ని కూడా ఇస్తుంది. జ్ఞాని భక్తులను రక్షిస్తాడు, కాని అది సంకల్పం ద్వారా కాదు, వారికి సంకల్పం అంటూ ఉండదు, కేవలం వారి సన్నిధి ద్వారా మాత్రమే రక్షణ జరుగుతుంది.

భగవాన్‌ను కేవలం జ్ఞానిగా మాత్రమే చూసే పాశ్చాత్య దృక్పథాన్ని గురువుగారు ఎన్నడూ అంగీకరించలేదు లేదా ఏకీభవించలేదు, అంతే కాదు ఈ అసంబద్ధ దృక్పథం ఆధ్యాత్మిక జీవితంలో బోధనల పాత్రను వక్రీకరించడానికి దారితీసిందని భావించారు. బోధనలకు మూర్తీభవించిన రూపమయిన గురువు జ్ఞానోదయపు సన్నిధి నుండి దూరంగా జరిగినపుడు, బోధనలు అవి చెప్తున్న సాక్షాత్కారాన్ని పొందడానికి ఎటువంటి తోడ్పాటును అందించకుండా, శుష్కంగా మారుతాయి.



భగవాన్ సన్నిధియే ఆయన బోధనకు ప్రామాణికతను, పరివర్తనకు కారణమైన శక్తి ఇచ్చింది. అలా కాకపోతే శాశ్వతమైన గుణాత్మక మార్పును తీసుకురావడంలో బోధనలు నిరుపయోగంగా మారుతాయి, అయితే మౌఖిక బోధనలు కూడా అంతర్లీనంగా ఉపశమనాన్ని కలిగిస్తాయనడంలో సందేహం లేదు, భగవాన్ కూడా గురు బోధల యొక్క ప్రభావాన్ని భగవాన్ సమగ్ర సాహిత్యంలో (పేజీ 299-300) చెప్పారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇక్కడ కూడా భగవాన్ అనుగ్రహ రూపంలోనే అని చెప్పబడింది. ఏదేమైనా, భగవాన్ బోధన ఎక్కువ భాగం మౌనంలోనే జరిగింది. రమణుల విషయంలో వారు ఆదిశంకరుల కన్నా దక్షిణామూర్తితోనే ఎక్కువ సారూప్యాన్ని కలిగివున్నారు.

గురువుగారికి భగవాన్ జీవితం ముఖ్యం కావడానికి రెండవ కారణం, అందులో భక్తికి కేంద్ర స్థానం ఉండటం, గురువుగారి దృక్పథంలో రమణుడు ప్రధానంగా భక్తుడు, ఇది ఇప్పుడున్న పాశ్చాత్య దృక్పథానికి పూర్తి విరుద్ధం. భగవాన్ బోధనలకు సంబంధించిన చాలా రచనలు భక్తుల అభ్యర్థనలకు ప్రతిస్పందనగా జరిగాయని ఎత్తి చూపుతూ భగవాన్ భక్తులు నిర్ధారించారు. భగవాన్ తమంతట తాము చేసిన రెండు రచనలు అరుణాచల పదికం, అరుణాచల అష్టకం – ఈ రెండూ పరమాత్మ(నిర్గుణ బ్రహ్మం) పట్ల ప్రేమను, తమ సద్గురువు (అరుణాచలేశ్వరుని) పరంగా వ్యక్తం చేసే అత్యుత్తమ స్థాయి భక్తి కవితలు. చాలా మంది పాశ్చాత్యులు రమణులు ఒక జడమైన పర్వతాన్ని తమ గురువుగా తీసుకున్నారని అంగీకరించడం కష్టం, కానీ ఇది ఆత్మసాక్షాత్కారం, జ్ఞానం పొందిన తరువాత మహాత్ములలో జనించే అరుదైన, అత్యంత ఉదాత్తమైన దైవిక ప్రేమరూపమైన భక్తి, దీనిని జ్ఞానోత్తర భక్తి (జ్ఞానం కంటే ఉన్నతమైన భక్తి) అని పిలుస్తారు. విచిత్రమేమిటంటే, అద్వైతం చెప్పినట్లు, ఈ అంతిమ స్థాయిలో ప్రేమ, దాని లక్ష్యవస్తువు ఏకమవుతాయి, జ్ఞానం ఏకానుభూతిలో కలిసిపోతుంది. ఈ అర్థంలో జ్ఞానాన్ని 'సంపూర్ణ సత్యం యొక్క అనుభవ జ్ఞానం'గా నిర్వచించవచ్చు. ఇది అలౌకికమైన, అతీంద్రియమైన, అతీతమైన అనుభవం.

ఈ అత్యున్నతమైన ప్రేమ చాలా అరుదైనది అయినప్పటికీ, శాస్త్రాలు దీనిని అంగీకరించాయి (ఇది గీతలో 12.3-4 వద్ద ప్రస్తావించబడింది), మరియు భగవాన్ స్వయంగా దేవరాజ ముదలియార్ రచించిన అనుదినము రమణులతో గ్రంథంలో (10-4-46 ఉదయం) ప్రస్తావించారు, **ఇక్కడ ఇది**



**భక్తి–ఉత్తర జ్ఞానం, దీనిని అతీత అనుభవం నుండి విడదీయరానిదిగా వర్ణించబడింది. గురువుగారి దృక్కోణం నుండి, ఈ అనిర్వచనీయమైన, మహోన్నతమైన ప్రేమ రమణులను నిర్వచించిందని చెప్పవచ్చు – ఆ దివ్య ఆనంద రసానుభూతి భగవాన్ స్వరూపం, ఆయన కళ్ళలోని ప్రశాంతమైన వెలుగు, ఆయన చిరునవ్వు అనుగ్రహ కారుణ్యం.**

ఆధ్యాత్మిక ప్రేమ యొక్క అత్యంత ఉత్కృష్టమైన, అరుదైన ఆ స్వరూపం భగవాన్‌కు భౌతిక ప్రపంచంలో పూర్తిగా భిన్నమైన రూపంలో దొరికింది. అది పర్వతాలలో పవిత్రమైన అరుణాచలం (సంస్కృతంలో 'గురువు' అనే పదానికి 'బరువైన' అని అర్థం). అరుణాచలుడు తన 'తండ్రి', తన ప్రియగురువు, చిన్నతనంలో ఆయనను తన పాదాల చెంతకు చేర్చుకున్నాడు. భగవాన్ తమ ప్రదక్షిణల ద్వారా, కవిత్వం ద్వారా ఆరాధించి, ప్రతిరోజూ దర్శనం చేసుకున్నారు, జీవిత పర్యంతం, ఒక్క రోజు కూడా అరుణాచలాన్ని వదలలేదు, చివరి శ్వాస వరకు అరుణాచలాన్ని చూస్తూ, కీర్తిస్తూ సమాధిగతులయ్యారు.

ఇక్కడ భగవాన్ మాటల్లో చెప్పాలంటే "అరుణాచలా, నీవు కృపాస్వరూపానివి! ఒక్కసారి నన్ను వశపరుచుకుని, ప్రేమలేని నాహృదయంలో ప్రేమను రగిలించి, ఇప్పుడు వదిలివేశావు, నన్ను ప్రేమతో నింపి ఎందుకు దగ్గరకు తీసుకోవడం లేదు, నిరంతరం నీకోసం తపిస్తూ మైనంలా కరిగిపోతున్నాను, ప్రేమనుండి ఉద్భవిస్తున్న ఓ ఆనందమూర్తీ! భక్తుల హృదయాలలో పొంగుతున్న ఓ అమృతఝరీ! నా స్వర్గధామమా! నీ సంకల్పమే నెరవేరుగాక, అదే నాకు పదివేలు!!"

రమణుల్లో కేవలం జ్ఞానాన్ని మాత్రమే చూసే పాశ్చాత్య దృక్పథం ఈ విషయాన్ని విస్మరించింది. భగవాన్ జీవితంలోని సౌందర్యం, ప్రేమ, కవిత్వం మొదలైనవి భగవాన్ జీవన సారం. ఇది భగవాన్ బోధనలకు సాధికారతను, భక్తుల ఉద్ధరణకు అవసరమైన శక్తిని ఇచ్చింది. ఏదో ఒక రూపంలో ఈ ప్రభావవంతమైన ప్రేమ లేకుండా, కేవలం బోధనల ద్వారా మాత్రమే ముక్తిని పొందడానికి ప్రయత్నించడం, కూర్చున్న కొమ్మను నరుక్కోవడానికి ప్రయత్నించినట్లే అని అంటారు గురువుగారు. దానివలన ప్రయోజనం లేదు. బహుశా ఈ మార్గంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ప్రేమ, భక్తి లేని ప్రయత్నం యొక్క నిరర్థకతను, అహం తనను తాను తొలగించుకోవాలనే వృధాప్రయాసలోని నిరాశను అనుభవించి ఉండవచ్చు. ఈ పాత సమస్యను చూడటానికి మరో



మార్గం ఉందని, కొత్త పరిష్కారాన్ని కనుగొనడానికి అంతర్దృష్టి కలగడానికి కావలసింది కేవలం దృక్పథంలో కాస్త మార్పు మాత్రమేనని గురువుగారి సత్సంగాలు స్ఫూర్తిదాయకంగా గుర్తు చేస్తాయి.

భగవాన్ పట్ల గురుదేవుల దృక్పథం భగవాన్ జీవితానికి ఒక అందాన్ని, సంపూర్ణతను ఆయన పొందిన అసాధారణమైన సాక్షాత్కారం పట్ల మన ఆరాధనను మరింత పెంచుతుంది. అందువలన గురువుగారి సత్సంగాల నుండి ఎంపిక చేసిన ఈ క్రింది వ్యాసాలు, మూల ప్రచురణకు వెలుపల మొదటిసారిగా, గురువుగారు ప్రేమించిన మహాత్ములు శ్రీరమణమహర్షి స్మృతిని పరిరక్షించడానికి అంకితం చేయబడిన ఈ విశిష్ట పత్రికలో ప్రచురింపబడుతున్నాయి.

భగవాన్ సాటిలేని సాక్షాత్కారం, నిర్మలమైన వారి జీవితం, మానవాళికి వారు చేసిన సేవ గురువుగారి స్వీయ సాక్షాత్కారానికి, ఆ అత్యున్నత స్థితిని అద్వితీయంగా వ్యక్తం చెయ్యడానికి ప్రేరణనిచ్చింది.

– **"A Modern Saint Inspired by Sri Bhagavan"** by Ram Brown Crowell **కు స్వేచ్ఛానువాదము**

## గురుదేవుల అనుగ్రహభాషణం

(గత సంచిక తరువాయి)

నిజానికి మనం పొందే శరణాగతి బాబాకు కాదు. బాహ్యంగా అనుకున్నప్పుడు 'బాబా' అనుకుంటాం మనం. నిజానికి ఎవరికి పొందుతున్నాం అనంటే, మనలో అస్పష్టంగా ఉండేటువంటి ఆ భావం ఉంది చూశారా, దేనివల్లనైతే మనం పూర్తి ఆనందాన్ని పొందుతున్నామో అనే భావం ఉన్నదే, ఈ భావానికి ఒక రూపాన్ని ఇచ్చినటువంటి రూపం బాబా. ఆ రూపానికి మనం శరణాగతి పొందుతున్నాం. అది బాహ్యంగా చెప్పేటప్పుడు బాబాకు శరణాగతి పొందుతున్నాం అని చెప్తాము. ఎందుకు శరణాగతి పొందారు అని ఎవరైనా ప్రశ్న వేస్తే మనం టకటకా ఎక్స్‌పీరియెన్సెస్ చెప్తాం. వేరే కోణాల్లో నుంచి ఆలోచించండి. ఈ ఎక్స్‌పీరియెన్సెస్ వల్ల శరణాగతి పొందేయాలా? జీవితాన్నంతా ఆయన చేతిలో పెట్టాలా? నాకు జబ్బొచ్చింది, బాబాకు మ్రొక్కుకున్నాను, జబ్బు తగ్గిపోయింది, అందుకని శరణాగతి పొందాను అనంటాడు. అరే, జబ్బు తగ్గిపోతే డాక్టరు కూడా తగ్గిస్తాడు కదా! డాక్టరుకి శరణాగతి పొందుతావా?



మనం చెప్పేటప్పుడు అటువంటి రీజన్స్ చెప్తున్నాంగాని, ఇది కాదు. దానివల్ల కాదు, ఎవరైనా శరణాగతి పొందేది. అది మనం చెప్పలేం. ఎందుకంటే మనలోనే అవ్యక్తంగా ఉంది. అస్పష్టంగా ఉంది. నేను చెప్తున్నా మీకు అర్థం కావడంలేదు ఇప్పుడు, మీకు అస్పష్టంగానే ఉంది. అది అంత అస్పష్టమైనటువంటిది. దీన్ని స్పష్టీకరించుకుంటూ పోవడమే మనం చేయవలసింది.

ఇక ఈ పూర్వజన్మ, వచ్చేజన్మ అనేటువంటి వీటిల్లో మొదలు పెట్టామనుకోండి, ఇవి మన అనుభవం మీద కంటే కూడానూ ఎదుటివాడి అనుభవం మీద, దాని యొక్క authority మీద ఆధారపడి ఉంటాయి. ఇలా, ఇటువంటి authority మీద ఆధారపడుతూపోతే ఇక దానికి అంతులేదు. మనలో దుఃఖం ఉంది. మనలో అసంతృప్తి ఉంది. మనకి ఆనందం కావాలి. మనకు ఇంతవరకూ అనుభవంలో లేనటువంటి ఒక రుచి, 'బాబా' అనేటువంటి ఒక సద్గురుమూర్తి ద్వారా మనకు అనుభవమైంది. ఈ అనుభవాన్ని ఇంకా ఎక్కువ చేసుకుంటూ పోయి, ఇంకా స్పష్టం చేసుకోవడం ఎలా? ఇవన్నీ కూడానూ మన అనుభవంలో ఉండేటువంటివే.

వీటికి శాస్త్రాలు అవసరం లేదు, ఎవరో అనుభవం యొక్క authority అవసరం లేదు. మీ అనుభవమే మీకు శాస్త్రం. మీ అనుభవమే మీకు వేదం. దానికి ఎవరు చెప్పాలి? నేను చెప్తున్నది కూడా మీ అనుభవాన్ని విశ్లేషించి చెప్తున్నాను, అంతే. Dissect చేస్తున్నాను. నిజానికి మీరు ఆధారపడవలసింది మాత్రం మీ అనుభవం మీదే. మీ అనుభవమే మీకు అస్పష్టంగా ఉన్నది. దానికి స్పష్టీకరణ ఇవ్వడానికోసం ప్రయత్నం చేస్తున్నాను. ఇది కర్రవిడిచి సాము చెయ్యకుండా ఉండటం లాంటిది. ఇదీ బాబా పంథా.

**భక్తుడు :** Practical approach.

**గురువుగారు :** ఉండవచ్చు, ఉండకపోవచ్చు. స్వర్గం ఉందా? ఉండొచ్చు, ఉండకపోవచ్చు. ఏమైందట ఇప్పుడు? స్వర్గం ఉంటే నాకేంటి? లేకపోతే నాకేంటి? దేవుడనేవాడు ఉన్నాడా? ఉండొచ్చు, ఉండకపోవచ్చు. ఏమైందట? నాకు బాబా ఉన్నారు. ఆ దేవుడనేవాడు మీరనేటువంటి వాడెవడో అది బాబా రూపంలో నాకు అనుభవమవుతుంది. నాకు దేవుడనేటువంటి కాన్సెప్ట్ బాబాలాగా కనిపించింది. బాబా దేవుడా? అవ్వచ్చు, కాకపోవచ్చు. మనకు వద్దది. కైలాసం ఉందా? ఉండొచ్చు, ఉండకపోవచ్చు. దానివల్ల నాకేంటి? ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి? ముందు మన యొక్క సమస్య



మీద Practical approach... ముందు దీని మీద ఫోకస్ చెయ్యండి. ఈ కలెక్షన్ ఉంది చూశారా, ఈ కాన్సెప్ట్స్ యొక్క కలెక్షన్, దీనికి అంతం లేదు. పోగా పోగా మన బుర్ర ఒక చెత్తకుండీలాగా తయారవుతుంది. ఒకదానికొకటి సంబంధం లేకుండా బొచ్చెడు కాన్సెప్ట్స్ మనం ప్రోగుచేసుకుంటాం. మళ్ళీ వీటినంతా చిమ్మి పారవేయడానికి కొంచెం టైమ్ పడుతుంది. ఊఁ, ఇంకేంటి?

**భక్తుడు :** అలా అస్పష్టంగా ఉన్న మన అనుభవాన్ని స్పష్టత చేకూర్చేది బాబానా? లేకపోతే బాబా పారాయణ, శిరిడీకి రావడం, లేకపోతే బాబా స్మరణ చేసుకోవడం, మనం చేసుకునే సాధన, ఇవన్నీ కూడా మనకు త్వరగా స్పష్టత రావడానికి హెల్ప్ చేస్తాయా? లేకపోతే బాబానే అన్నీ చేయిస్తారా, సార్?

**గురువుగారు :** ఇందాక మొదట వేసిన ప్రశ్న ఏమిటంటే... మనం ఏం చెయ్యాల్సిన అవసరం లేదా? అంతా బాబానే చూసుకుంటారా? లేకపోతే మనమేమన్నా చేయాలా? అదే కదా ప్రశ్న? వచ్చిన సమస్య ఏమవుతుందనంటే... చేసేది బాబానే. మీరు చేసినందువల్ల ఆ అనుభవం రాదు అని కొన్ని సందర్భాల్లో నేను చెప్పిన మాట నిజమే! దానికేమీ అనుమానం అక్కర్లేదు. నా ఉద్దేశ్యం ఏమిటి? మీరు పొందేటువంటి చరమానుభవం, మీరు చేసేటువంటి మీన్స్ వల్ల ఆధారపడిలేదు అని మాత్రమే చెప్పాను. ఎలాగా? మీకు ఈ రోజు ఆకలవుతోంది. మీకందరికీ భోజనం తయారుచేసిపెడతాను, వెళ్ళి, అట్లా వెళ్ళేసి ఒక చక్కర్ కొట్టుకొని రండి అని చెప్పాను. నేనే వెళుతున్నాను, సరుకులు తెచ్చుకున్నాను, వంట చేశాను, అంతా తీసుకొచ్చి పెట్టాను. మిమ్మల్నేమీ వంట చేయమని చెప్పలేదు. తినిపెట్టడం కూడా నేనే చెయ్యాలా? తినిపెట్టడం మీరు చెయ్యాలి కదా. ఈ లోపల ఏం చేస్తున్నారు? నానాగడ్డీ తినొస్తున్నారు అక్కడికి వెళ్ళి! అక్కడ ఒక చిన్న మసాలదోశ, ఇక్కడికి పోయి రెండు బిస్కెట్లు, అక్కడికి పోయి రెండు పప్పుచెక్కలు, కొన్ని బొరుగులు, అవీ ఇవీ తినేసి ఇక్కడికి వచ్చేటప్పటికి మీకు ఆకలి చచ్చిపోతోంది. చేసిన అన్నం వేస్ట్ అవుతోంది. తినడంలేదు. వెగటు పుడుతోంది ఒక్కోసారి. కంచం ముందు కూర్చొని, అన్నం వడ్డించగానే, యాక్ అంటున్నారు. ఎందుకంటే అది బాగా ఎక్కువైపోయి కడుపులో అజీర్ణం చేసింది.

నేను ఏం చెప్తున్నానంటే, మీకీ అనుభవం ఇస్తున్నారు బాబా. బాబానే ఇస్తున్నారు. ఆ స్పష్టత ఇస్తున్నారు. ఈ స్పష్టత తినేదానికి ఆకలితో తయారుకండి. సమాయత్తంకండి. అనుభవించండి.



ఈ అనుభవాన్ని పొందేదానికి చేసే ప్రయత్నాలే... నేను చెప్పినటువంటి ఈ పారాయణ, శిరిడీకి రావడం, ప్రదక్షిణలు చేయడం, బాబా యొక్క సన్నిధి అనుభవించడం. ఇవన్నీ కూడానూ ఏమిటనంటే ఆయనిచ్చేటువంటి అనుభవాన్ని ఇంకా ఇంకా రుచికరంగా మనం ఎంజాయ్ చేయడంలాంటివి. ఎంజాయ్ చేసే ప్రయత్నాలే ఇవన్నీ కూడానూ. మీరు చేసే సాధనలు కావవి. నేను సాధనలు అనడంలేదు వాటిని. అవి చేయకపోగా, పోనీ గమ్మునున్నా ఫర్వాలేదు. మనం గమ్మునుండటంలేదు. వెళ్ళేసి అజీర్తి తెచ్చుకుంటున్నాం. అజీర్తి తెచ్చుకోవడం ద్వారా ఏమవుతుంది? బాబా తయారుచేసిన షడ్రసోపేతమైన భోజనం పెట్టినా తినలేని పొజిషన్‌లో ఉన్నాం. అప్పుడేం చెయ్యాల్సి వస్తోంది? భోజనం అటు ప్రక్కన పెట్టుకొని, మీకు బేది మాత్రల కోసం వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముందు ఆ గసమళం పోగొట్టుకున్న తర్వాత, మళ్ళీ బాగా ఆకలయ్యి, మళ్ళీ కూర్చొని శుభ్రంగా భోంచేస్తారు కదా అని. కాబట్టి మందెయ్యాల్సి వస్తోంది.

కాబట్టి మీరు చేసే పారాయణ వల్ల మీకు ఆ అనుభూతి వస్తుంది, దీనివల్ల వస్తుంది అని నేనెప్పుడూ చెప్పడం లేదు. కానీ ఇవి చెయ్యొద్దు, అవసరం లేదు అని కూడా నేనేమీ చెప్పడం లేదు. ఇవి కూడా ఎందుకు అవసరమంటే, ఈ ఇచ్చేటువంటి అనుభూతిని మీరు అనుభవిస్తారు. లేకపోతే కొంతకాలం పోయేటప్పటికి ఏమవుతుందనంటే, అజీర్తి చేసేస్తుంది. వెగటు పుడుతుంది ఒక్కోసారి. గురువుగారంటే అబ్బా, నాకు విపరీతమైన ప్రేమ. బాబా అంటే ఇంక చెప్పేపన్లేదు అనుకుంటాం. ఎప్పుడెప్పుడు శిరిడీకి ఎగ్గొడదామా, నా దగ్గరకు రావడానికి ఎగ్గొడదామా అని చూస్తుంటారు. బుర్రంతా ఈ ప్రాపంచికమైనటువంటి విషయాలు, వీటితో వర్రీ అయిపోతుంటాం. అంతకుముందు ఈ ప్రాపంచికమైన కోరికలు... బాబా ఉన్నారులే, చేస్తార్లే, హ్యాపీగా మనం అక్కడికిపోయి శిరిడీలో కూర్చొని కాసేపు అక్కడ ఏమైనా చేసుకుందాం... అక్కడ ఉన్నా బాబా ఉన్నారులే అని అనుకోగలుగుతున్నాం. ఈ అజీర్తి చేసేటప్పటికి ఏమైపోతోంది? మనమే పోవాలి, మనమే చెయ్యాలి అనంటాం. మరి, బాబా విషయం కదయ్యా? మనమేమీ చెయ్యనక్కర్లేదు, అంతా బాబా ఉన్నారు, అంతా ఆయన చూసుకుంటారు, మనమేం చెయ్యనక్కర్లేదు అనంటాం. ఇవి అజీర్తి చేసిన మీదట వచ్చేటువంటి మాటలు.

**భక్తుడు :** పైత్య ప్రకోపం వల్ల.

**గురువుగారు :** పైత్య ప్రకోపం వల్ల. దానివల్ల వాళ్ళకి మహాపైత్యమంత్రం వెయ్యాలి. కాబట్టి నేనేమీ



సాధనా మార్గాలని చెప్పడం లేదు.

**భక్తుడు :** చెప్పకపోయినా అవి సాధనా మార్గాలే కదా, సార్?

**గురువుగారు :** ఎలా అవుతాయి? బయటవుండే వాళ్ళకి అవి సాధనా మార్గాల క్రింద చెప్తున్నారు. మార్గంలో చాలా తేడా ఉంది, రెండింటికి కూడానూ. సాధనా మార్గమంటే ఏమిటి? ఒక end పొందే దానికోసం మనం చేసేటువంటి మీన్స్‌లాగా నేను చెప్పడంలేదు వాటిని.

ఒక అనుభవాన్ని స్థిమితంగా ఇంకా ఇంకా ఎక్కువ ఎంజాయ్ చేసేటువంటి ప్రయత్నం క్రింద చెప్తున్నాను. కడుపుని ఖాళీగా పెట్టుకుని, కడుపుని ఆరోగ్యంగా పెట్టుకోవడం, తినబోయేటువంటి భోజనాన్ని ఎంజాయ్ చెయ్యడానికి ఉపయోగపడుతుంది తప్పితే, భోజనం చెయ్యమని, వంట చేసుకొమ్మని నేను చెప్పడంలేదు. వంట చేసేది బాబానే. అందుకనే బాబా అన్నది. **"నువ్వు ఊరక కూర్చో. నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను"** అన్నారు. ఆయన మాటల్లో అక్షరం కూడా ఏం పొల్లుపోదు. వచ్చిన ప్రాబ్లమ్ అంతా ఏంటనంటే మనం ఊరక కూర్చోవడం లేదు, అదీ వచ్చిన సమస్య.

ఊరక కూర్చోవడమంటే ఏంటన్నమాట? బాబా స్మరణ తప్పితే, బాబా స్మరణ చెయ్యకుండా ఉంటే, ఊరక కూర్చున్నట్లు లెక్క మన దృష్టిలో. ఇక మిగతావన్నీ చేస్తాం. చేసుకోకుండా, చివరికంటా గమ్యం చేరుస్తాను అన్నావుగా, చేర్చు అనంటాం. నువ్వు ఊరక కూర్చుంటే కదా? అంటే... కూర్చోక నేనేం చేశాను కనుక? నేనేం చెయ్యట్లేదుగా! నేనేమన్నా ధ్యానాలు చేశానా? ఇంకా వీలైతే ధ్యానాలు చేసేవాళ్ళని ఎగతాళి కూడా చేశానుగా నేను. అబ్బో, వీడు పెద్ద మెడిటేషన్ చేసేవాడివే అని వాడినన్నాను కదా. నువ్వు పారాయణ చేస్తున్నావా, అబ్బో సాధకుడివే అని వాడిని కూడా నేనంటినే. మరి నాకు అన్ని క్వాలిఫికేషన్స్ ఉన్నాయి బాబా, మరి నా సంగతేంటి? అనంటున్నాం మళ్ళా.

**భక్తుడు :** గురువుగారూ! మనకు ఒక కోరిక లేదా ఒక కష్టం తీరడానికి పారాయణ చెయ్యడం, ప్రదక్షిణలు చెయ్యడంలాంటివి ఎట్లా ఉపయోగపడతాయి?

**గురువుగారు :** నిజానికి దానికి, దీనికి ఏమీ సంబంధం లేదు. మన కోరికలు ఇవి చేస్తే తీరుతాయి అనేటువంటిది ఏమీ లేదు.

**భక్తుడు :** అవి మనం చేసుకోకూడదని ఏమైనా ఉందా?



**గురువుగారు :** చేసుకోకూడదని లేదు, ఇంతకు ముందు చెప్పాను కదా! అవి ఎందుకు చేసుకోవాలనంటే, ఇచ్చిన అనుభవాన్ని నిలుపుకోవడానికి ఆ అనుభవాన్ని ఇంకా ఎక్కువగా పొందేదానికి... వాటికి ప్రిపరేషన్స్‌లాంటివి. తర్వాత, సహజంగా ఉంటుందది... నాకు బాబాపట్ల విపరీతమైన ప్రేమ ఉంది, నాకు బాబా తప్పితే ఇంక వేరే ఏమీ లేదు, నాకు ఆయనే అన్నింటికీ సర్వం అని అనుకుంటూ, ఆయన గురించి ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా ఉండటమేమిటి? అది ఎట్లా వీలుపడుతుంది? ఒక్కరవ్వ, ఇంత సమయం దొరికితే బాబా మీదకు మనస్సు వెళ్ళిపోవాలి.

ఇప్పుడు మీరందరూ కూర్చొని ఉన్నారు, నేను మాట్లాడుతున్నాను, నా మాటలు వింటున్నారు. నేను మాట్లాడటం ఒక్క నిమిషం ఆపాననుకోండి, మీకు ఆ ఫ్యాన్ సౌండ్ వినిపిస్తుందిగా? ఏమీ మాట్లాడకుండా సైలెంట్‌గా ఉన్నాను, ఫ్యాన్ ఎక్కువ సౌండ్ వస్తుందే, బుర్ బుర్ అంటున్నదే అని అనిపిస్తుంది. ఆ దారిలో కుక్క భౌ, భౌ అన్నది, అది వినిపిస్తుంది. అదిగో ఆ వెహికల్ పోతోంది, మీకు వినిపిస్తుంది. నాతో మాట్లాడేటప్పుడు ఫ్యాన్ తిరుగుతూనే ఉంది కానీ మీకు వినిపించడం లేదు. బాబా స్మరణ అనేటువంటిది ఆ ఫ్యాన్‌లాగా ఉండాలి, ఆ ఫ్యాన్ సౌండ్‌లాగా ఉండాలి. ప్రాపంచికంగా మనం చేసేటువంటి వ్యాపారాలు, ఈ ఉద్యోగాలు, ఈ ప్రాపంచిక వ్యవహారాలంతా కూడానూ, ఇప్పుడు నా మాటలు మీరు వింటున్నారు చూశారా, ఈ వినడంలాగా ఉండాలి. ఈ వ్యవహారాలు అయిపోగానే వెంటనే మనస్సు అటు వెళ్ళిపోవాలి, అది వినిపించాలి. అది సరైన పథం, సాయిపథమంటే! మీరు ఇరవై నాలుగు గంటల్లో ఇరవై మూడున్నర గంటలసేపు వ్యాపారమే చేసుకోండి. ఏమీ కాదనను. కానీ ఆ అరగంట బాబా దగ్గర ఉన్నదా, లేదా? అప్రయత్నంగా బాబా మీదకు పోతుందా, లేదా మనస్సు? అనే దాని మీద ఈ ఇరవై మూడున్నర గంటలు డిపెండ్ అయివుంటుంది. బాబాపట్ల సరైనటువంటి ప్రేమ మనలోగానీ వస్తే, వెళ్ళిపోతుందంతే మనస్సు, అది అయిపోయి అట్లా కూర్చోగానే మనస్సు బాబా మీద నిలిచిపోతుంది. ల్యాండ్ అవుతుంది, అక్కడకు వెళ్ళి. అంతటి ప్రేమ కలిగించేదానికోసంగా ఈ సత్సంగాలుగాని, పారాయణలుగాని, శిరిడీకి రావడంగాని, నా దగ్గరకు రావడంగానీ, ఇవన్నీ కూడా... అది అసలైన సాయిపథం ప్రిన్సిపుల్. మన జీవితాలన్నింటిలోనూ బాబా స్ఫురణ అనేటువంటిది ఆ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లాగా ఉండాలి.

***– శ్రీబాబూజీ సత్సంగ భాషణాలు***



# విధానం లేని దానం

సత్యం, శుచిత్వం, దయ, దానం అనేవి నాలుగూ ధర్మదేవుని నాలుగు పాదాలు ఒక్కొక్క యుగంతోబాటు ఒక్కొక్క పాదం విరిగిపోతూ రాగా కలియుగం వచ్చేటప్పటికీ నాలుగవ పాదమైన దానం మాత్రం మిగులుతుంది. అది కూడా కుంటిగా, అంటే ఆ మిగిలిన దానం కూడా విధానంగా జరుగదు. అర్థించి వచ్చిన వారి ఆవశ్యకతను గమనించి ప్రేమతో వారి హితాన్ని కోరి చేసేది దానమవుతుంది. సమాజంలోని ఆవశ్యకతలను గమనించి, త్యాగబుద్ధితో ఆ ఆవశ్యకతలు నెరవేరేందుకుగాను చిత్తశుద్ధితో సమర్పణ చేసేది దానమవుతుంది.

ఇవాళ మనదేశంలో దానాలు రెండు రకాలుగా జరుగుతున్నాయి. విదేశస్థులు చేస్తున్న దానాలు ఒక రకం. విదేశస్థులు చేస్తున్న దానాలలో ఎక్కువ శాతం మతం మార్పిడి కోసం జరుగుతున్నాయి. మన దేశస్థులకి విద్య, వైద్య రంగాలలో ఎనలేని సేవ చేస్తున్న విదేశీ బృందాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఈనాడు ఆ దానాల నుండి వారు కోరుతున్నదేమిటి? భారతదేశం బాగుపడాలనా? భారతీయులు అభివృద్ధి చెందాలనా? ఏ మాత్రం కాదు. భారతీయులు తమ మతస్థులు కావాలని. అందుకుగాను ఆ భారతీయుల అవసరాలను గమనించి, వాటిని తీర్చడం ద్వారా మతం మార్చడమనేది సాధిస్తున్నారు. చూసారా? “భారతీయులూ మనలాంటి మనుష్యులే. వాళ్ళకు మన సహకారమవసరం. కొంచెం సహకారమందిస్తే, వాళ్ళూ మనలాగ నిలబడిపోతారు కదా!” అన్న ప్రేమతో, విశాల హృదయంతో ఆ దానాలు జరిగితే ఎంత బాగుంటుంది. వాళ్ళ అవసరాలను మన దానాల ద్వారా తీర్చి, మన మతస్థులుగా వాళ్ళని మార్చేద్దామనుకునేటప్పటికీ ఆ దానం మైలపడిపోతున్నది. ఆ మతస్థులలో సేవాస్వరూపులుగా పేరు పొందిన వారు కూడా సేవకు, మతానికి మీరెందుకు ముడిపెడుతున్నారని అడిగినపుడు ఏమంటున్నారో తెలుసునా? మా మతంలోనికి చేరనపుడు మేమెందుకు సేవ చేయాలి? అంటున్నారు. మా గమ్యమదే కదా! అంటున్నారు. ఇక ఆ సేవా స్వరూపుల సేవ యొక్క స్వరూపమేమిటో మీరే గమనించండి.

ఇక మనవాళ్ళ దానాల సంగతి. దేశంలోని స్థితిగతులతో వీళ్ళలో ఎక్కువమందికి నిమిత్తం లేదు. ఆ దానాన్ని పొందే వాళ్ళ పాత్రతతోనూ వీళ్లకంతగా నిమిత్తం లేదు. వీళ్ళకు కావలసిందల్లా



పేరు, ప్రతిష్ఠ, పొగడ్త. వాటి కోసం వీళ్ళు కోట్లు గుమ్మరిస్తున్నారు. ఇచ్చిన ప్రతి వస్తువు మీదా తమ పేరు ఉండాలని ఉబలాటపడుతూ ఉంటారు. చివరకు ఒక నాప**'రాయి'** ఇచ్చినా దానిపైన నా పేరు **'రాయి'** అంటారు. ఆ పేరు కొంచెం పెద్దదయితే ప్రక్కవాడి నాపరాయి మీదకు కూడా వెళ్ళిపోతూ ఉంటుంది.

ఒకాయన ఒక గుడికి ఫ్యాన్ దానం చేసాడు. ఫ్యాన్ మీద పేరు మాత్రం వేయవద్దన్నాడు. వేస్తే రెక్కల మీద ఉన్న అతని పేరు కనపడకుండా పోతుందని అతని బాధ. ఒకాయన ఒక దేవుని విగ్రహం ఇచ్చాడు. ఆ విగ్రహం క్రింద తన పేరు వ్రాయించాడు. తెలియనివారు కొందరు ఆ పేరు చదివి, అది అతని విగ్రహమేమో అనుకున్నారు. ఇంకొకాయన ఎక్కడో కడుతున్న దేవాలయానికి కొంత దానం చేసాడు. ఎలా ఉంటుందో తెలియదు. సంవత్సరానికి ఒకసారి పోస్టులో ప్రసాదం మాత్రం వస్తుంది. "ఒకసారి ఒక గుడికి వెళ్ళాను. గుడి గోడల నిండా దాతల పేర్లే. ఆ పేర్ల బదులు కనీసం వాళ్ళకిష్టమైన శ్లోకాలు ఏ భగవద్గీతలోనివో, సద్గ్రంథాలలోనివో వ్రాయించుకుంటే బాగుంటుంది కదా అని నాకనిపించింది". మన పూర్వులు ఎన్ని దేవాలయాలు కట్టారు, ఎన్నెన్ని నిర్మాణాలు చేసారు. కానీ ఎక్కడైనా వాళ్ళ పేర్లు కనపడుతున్నాయా? మరి ఇప్పుడేమో పేర్లు తప్ప ఇంకేమీ కనపడని స్థితి.

మనకు దేశం పట్టదు, దేశ ప్రజలు పట్టరు. వారి అవసరాలు పట్టవు. ఇప్పుడున్న ఈ పరిస్థితుల్లో ఈ ధనాన్ని ఎలా సద్వినియోగం చేస్తే బాగుంటుందన్న ఆలోచన రాదు. ఈ దానాల్లో శ్రద్ధ లేదు, చిత్తశుద్ధి లేదు. లక్ష్యసిద్ధి లేదు. కేవలం పేరు ప్రతిష్ఠలు, పొగడ్తలూ, సన్మానాలు ఇవి చాలు మనకు. పేరు ప్రతిష్ఠల వ్యామోహంలో పడ్డాము మనం. ఈ విధంగా అటువాళ్ళూ, ఇటు మనమూ కూడా దానాన్ని మైల పరుస్తున్నాం. దానానికి విధానం లేకుండా చేస్తున్నాం. మనం ఆశించిన స్వార్థ ప్రయోజనాల కోసం దానమనే ప్రక్రియను వాడుకుంటున్నాం. మనిషిని మనిషిగా చూడలేకపోతున్నాం. తోటి మనిషిగా ప్రేమ చూపలేకపోతున్నాం. చూసారా? కలి (కాల) ప్రభావం వల్ల మానవుల మనస్సులు ఎలా మలినమైపోతున్నాయో!

**– గురుకృప సంకలనము**



# గురుకృపాలహరి

**మనుజునిగా జన్మించు మహద్భాగ్యమున...**

**అంధకారమయ్యె అంతరంగము అసుర భావమున...**

**ఆచరణల జ్యోతి చేతబట్టి అవనికి వేంచేసే...**

**గతి తప్పిన మతులను సరిచేసే సద్గురు రూపమున...**

శుద్ధి, బుద్ధి, సిద్ధి మూడూ కలిసిన మూర్తి మనిషి. మరో జీవికి ఈ భాగ్యం కలిగిందా అంటే లేదనే సమాధానం. మరి ఇంతటి సిరి కలిగిన మనిషి చేయగలిగిన అద్భుతం ఏమంటే భగవంతుని దరిచేరాలన్న సంకల్పం కలిగి ఉండటమేనని మహాత్ముల జీవితాలు తేటతెల్లం చేస్తాయి. మా గురుదేవుల మాటల్లో “మనిషి దైవంగా ఎదగటం బాబా మతం” అన్న ఆలోచన సాధకుడికి స్ఫూర్తి. శ్రీరామకృష్ణులు తరచుగా భక్తులకు గుర్తు చేస్తుండేవారు – పవిత్రత కలిగి ఉండటం, సద్విషయాలను ‘ఆచరించడం’ మాత్రమే అత్యవసరమని. ఆచరణకు నోచుకోని ఆధ్యాత్మికత, ప్రేమను వ్యక్తం చేయని తంతులు, మార్పు తీసుకురాని మాటలు, పథాన్ని సరిదిద్దుకోని పారాయణలు ఎన్నటికీ మేలు చేకూర్చలేవు. ఆచరణాత్మక జీవనం, పవిత్రత రెండూ కలిసి ఒక్కటి(1)గా నిలబడితే మనం చేసే నియమ, నిష్ఠలు, నిత్య పూజాదికాలు, ధూప, దీప, నైవేద్యాలు ఆ ప్రక్కన చేరే సున్నాలుగా అభివర్ణించేవారు శ్రీరామకృష్ణులు. అందుకే ఈనాడు ఎన్నో క్రతువుల రూపంలో రాశులుగా, క్రోసులుగా భక్తి పిలవబడుతుంటే, పవిత్రత, శీలం కొరవడిన ఆధ్యాత్మికత మేడిపండు చందాన మానవ సమగ్ర ప్రగతికి దోహదపడక మరింతగా దిగజారిన మానవ విలువలుగా దర్శనమిస్తున్నాయి. క్రతువుల యంత్రాలుగా మనుషులను మార్చే ‘బరువులైన’ గురువులు తామర తంపరలుగా పుట్టుకొస్తున్నారు. అంతులేని సంపదను కూడబెట్టి ఎందరో జీవులు అశువులు బాపటానికి కూడా కారణమౌతున్నారు. ఇలాంటి దుర్దశకు కారణం అంతులేని ఆశల రాశులే అసలు కారణమని, మరోవంక చెప్పలేని మానసిక దౌర్భల్యం; తనపై తనకే విశ్వాసంలేని ఆత్మన్యూనతాభావం కారణాలాని సుస్పష్టం. క్రతువులనే ‘మ్రొక్కుబడులు’ కనీసం కాలాంతరంలో నిత్య నూతన ‘జీవనబడులుగా’ మారినా ఉపయోగం ఉండేదేమో! భగవంతుడిని కోర్కెలు తీర్చే బేహారిగా మార్చుకుంటూపోతే అది వర్తకంగానూ, జీవితం నిరర్థకంగానూ మిగిలిపోక మరేం సాధించగలం? అనన్య శరణాగతికి ఆలవాలమై, అంతరంగ శోధనకు, మనిషి దైవంగా ఎదిగేందుకు వలసిన సాధనకు, సమున్నత పూజ్యస్థానంగా వెలసిల్లిన



భారత యవనిక ఈనాడు కొందరు కపట గురువుల కల్పిత అంధకారంలో చిక్కుకోవడం ఎంతో శోచనీయం. అందుకే వివేకానందస్వామి “మతం సిద్ధాంతాల్లో, విశ్వాసాల్లో, మేధో విన్యాసాల్లోనూ లేదు. అది ఆచరణలో, ఆధ్యాత్మికులుగా పరిణతి పొందడంలో ఉంది, మతమంటే ప్రత్యక్షానుభూతి” అంటూ ఆచరణకున్న ప్రాధాన్యతను సువ్యక్తం చేశారు.

చావు పుట్టుకల చక్రభ్రమణంలో ఎన్ని జన్మలు గడిచాయో, ఎన్ని రూపాల్లో ఎంతటి ఘన సుకృతం చేసుకున్నామో పరమాచార్యుల స్మరణ, మా గురుచంద్రులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ చరణ సంస్మరణకు నోచుకున్నాము. ఆచరణ మూర్తీభవించిన అమృత స్వరూపులు వారిరువురు. ఒకరు సన్యాస ధర్మమున జగద్గురు చంద్రులై ఆచంద్రతారార్కమైన ఆధ్యాత్మిక కీర్తి పతాకను ఎగురవేస్తే, మరొకరు శ్రీసాయితత్త్వమును ఆనందరసగంగగా వర్షించి ప్రతీ మనిషి జీవితాన్ని సముద్ధరించడానికి గృహస్థుగా సద్గురు చంద్రులై విలసిల్లారు. (...క్రితం సంచికలలో మనం స్వామివారి విజయ యాత్రలు, వారి చరణ స్పర్శతో పునీతమైన క్షేత్ర సందర్శనాలు చూస్తూ ఉన్నాం.)

మహాత్ముల అడుగుజాడలే మనకు ఆనందజీవన సోపానాలు. భద్రాద్రి సీతారాముల సంప్రోక్షణ మహోత్సవాన్ని, కుంభాభిషేకాన్ని నిర్వహించి స్వామివారు గోదావరి మీదుగా పడవ ప్రయాణం చేసి, పాదచారులై ఏలూరులో 1969 ఫిబ్రవరి నెలలో శంకరమఠాన్ని ప్రారంభించారు. ఆ సంవత్సరం వసంత నవరాత్రులు ఒంగోలు పట్టణంలో జరిగాయి. అదే సమయంలో నాసిక్‌లో ఆదిశంకరుల విగ్రహ ప్రతిష్ఠ జరగాలన్న సంకల్పం జరిగింది. త్రయంబకేశ్వరుని ఆలయానికి దగ్గరలోనే మహారాష్ట్ర ప్రభుత్వం శంకరమఠానికి స్థలం కేటాయించడం జరిగింది. విజయవాడలోని శంకరమఠ ప్రాంగణ ప్రారంభం, ఆదిశంకరుల మూర్తి ప్రతిష్ఠ స్వామివారిచే 1969వ సంవత్సరం ఏప్రిల్ 21వ తారీఖున జరిగింది. ఆ పిమ్మట నెల్లూరు, శ్రీకాళహస్తి మీదుగా కాలినడకన తిరుమల చేరుకున్న స్వామివారికి అధికారిక లాంఛనములతో స్వాగతం పలుకబడింది. స్వామివారు తిరువేంగడనాథునికి జరిగిన అభిషేకాన్ని సుమారు గంటపాటు అక్కడే ఉండి తిలకించారు. అధికారులు గౌరవసత్కారాలతో అందజేసిన ప్రసాదాలను స్వామివారు భక్తులకు ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి సూచన మేరకు హిందూధర్మప్రతిష్ఠానం అన్న సంస్థకు సహకారమందించడానికి ముందుకు వచ్చింది. ప్రపంచమంతా హిందూధర్మంలోని మంచిని పంచాలన్న ప్రణాళికతో ఈ సంస్థను స్థాపించడం జరిగింది. ఆ తర్వాత జరిగిన బ్రహ్మోత్సవాలలో మూడురోజులు స్వామివారు పాల్గొనడం,



ఉత్సవమూర్తులు వివిధ వాహనారూఢులై వస్తుండగా నడిచి వస్తున్న స్వామిని చూసిన ఆ క్షణాలు మధురాతి మధురంగా సాగాయి. జియ్యంగార్ల ప్రేమాభిమానాలు, గౌరవసత్కారాలనందుకున్న స్వామివారు ఒక గంటపాటు ఆ కలియుగ దైవమైన వేంకటేశ్వరుని సేవలో గడిపి కాంచీపురం వైపుగా తమ పాదయాత్రను కొనసాగించారు. మధ్యలో తిరుత్తణిలో సుబ్రమణ్యస్వామిని సేవించుకుని అరక్కోణంలో రెండురోజులు విడిది తర్వాత కాంచీపురం పొలిమేరను చేరుకున్నారు స్వామి. ఎన్నో వసంతాల తర్వాత తిరిగి వేంచేసిన స్వామివారికి ఆనందసుమాలతో స్వాగతం పలికారు కంచివాసులు. సర్వతీర్థం ఒడ్డున నిర్మించబడ్డ పర్ణశాలే చాలాకాలం వారి నివాసమైంది. ఇక అక్కడ ఎంతోకాలం ఎడతెగని మౌనమే వారి సందేశమైంది. రోజులు, వారాలు, నెలలు స్వామివారు మౌనంలోనే గడిపేవారు. కాంచీపురం చేరాక తేనంబాక్కంలో వారి ఆవాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎందుకంటే అత్యంత కఠినమైన, అతి సాధారణమైన వనరులు, వసతులతో స్వామివారి జీవనం అత్యంత పవిత్రంగా, ఒక తపస్సులాగా సాగిందంటే అతిశయోక్తి కాదు. అక్కడి బ్రహ్మపురీశ్వర ఆలయం, ఆ తటాకం నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ స్వామివారిని సందర్శించుకోవడం లాంటి ముఖ్య అంశాలకు వేదికయ్యింది.

పైన పేర్కొన్నట్లు ఆచరణ ప్రధానంగానే మహాత్ముల జీవితం విలసిల్లినట్లు –మనం స్వామివారి జీవిత ఘట్టాలను గమనించవలసి ఉంటుంది. ఎందుకంటే వారు పాదచారిగా వెళ్ళిన ప్రతిచోట వారికెన్ని స్వాగత సత్కారాలు, పూర్ణకుంభ స్వాగతాలు, గౌరవమర్యాదలు, వేలాదిమంది జనసందోహం, ఆవిష్కరణలు, సంప్రోక్షణలు, ప్రాణప్రతిష్ఠలు. ఇలా ఎక్కడ చూసినా ఎప్పుడు చూసినా గొప్ప సంరంభమే, ఉత్సవ భావమే. కానీ 1969–1978 వరకు అంటే వారి 75వ సంవత్సరం నుండి సుమారు 84వ సంవత్సరం వరకు అత్యంత కఠినమైన, అతి సాధారణమైన జీవితాన్ని, భగవంతునిలో సంపూర్ణంగా లీనమైన సమయాన్ని గడిపారు. ఈ జాతి ఈనాటికీ ఎంతోకొంత భగవద్భక్తిని, భగవంతుని పొందాలన్న ఇచ్ఛను కలిగి ఉందంటే అది కేవలం స్వామివారి వంటి మహాత్ముల చలవే. బ్రహ్మపురీశ్వర ఆలయం పూర్తిగా పల్లె వాతావరణాన్ని కలిగిఉండేది. పట్టణ జనసమ్మర్ధానికి దూరంగా ప్రశాంతమైన ఆ వాతావరణం స్వామివారికి నచ్చేది. అక్కడ కాలం ఆగిపోయిందేమోనన్న భావన కలిగేది. ఈనాటికీ వారు ఒంటరిగా గడిపిన ప్రాంగణం వారి దివ్యసన్నిధిని ఓతప్రోతంగా అందజేస్తూనే ఉంటుందంటే అతిశయోక్తి కాదు. ఎంతో అత్యవసరమైతే తప్ప వారు ఎవ్వరితోనూ



సంభాషించేవారు కాదు. అక్కడ ఉన్న ఒక చిన్న కిటికిలో ఒక గుప్పెడు మరమరాలు పెడితే వాటిని మాత్రమే స్వీకరిస్తూ ఆ స్థలాన్ని కూడా తామే దర్భపుల్లలతో శుభ్రం చేసేవారు. వైద్యనాథన్ అనే ఆంతరంగిక భక్తుడు ఎంతో ఆర్తిగా వేడుకుంటే వారి స్నాన, జప సమయంలో వారు ఆ ప్రాంగణంలో లేని సమయంలో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి సమ్మతించారు. అక్కడ వారు తమ నిత్య కార్యక్రమాలను చేసుకోవడానికి ఉపయోగించిన బావిని ఈనాటికీ అలానే చూడగలం. బ్రహ్మపురీశ్వర ఆలయ ప్రాంగణంలోనే శ్రీమతి ఇందిరాగాంధీ స్వామివారిని దర్శించుకోవడం, అతి తక్కువగా జరిగిన సంభాషణ, కేవలం చివరకు స్వామివారు చేయెత్తి దీవించడం, అదే చివరకు వారి పార్టీ 'గుర్తు'గా మారడం నాటి భక్తులకు తెలిసిన విషయం. అక్కడి గణపతి మందిరాన్ని దర్శించే సమయంలో వారు చూసే కిటికీ, చెక్కమెట్లు ఎక్కి వారు గోపుర దర్శనం చేసుకున్న మధుర స్మృతులు, ఇప్పటికీ ఆలానే ఉన్నాయి. ఎన్నో నెలలు ఒంటి కాలిపై నిలబడి రెండు చేతులెత్తి నమస్కరిస్తూ ఉండిపోయేవారు అని వైద్యనాథన్ అనే ఆంతరంగిక భక్తుని స్వానుభవం. మానవాళికి మంచి జరగాలన్న ఏకైక తలంపు మరియు తమ గురు పరంపరకు అనన్య శరణాగతి చెందుతూ మనందరిలో మరింతగా భగవద్భక్తిని పాదుకొల్పే క్రమం కావచ్చు వారి ఆ తపోనిష్ఠ.

మా గురుదేవుల ఆశీస్సుల ఫలంగా స్వామివారి చరిత్రను, వారి జననం నుండి అధ్యయనం చేస్తున్నాము. ఒక్కసారి బాల్యంలో జరిగిన ఆ ఘటనలు నేడు మరోసారి అవలోకనం చేసుకుందాం. 13 సంవత్సరాల బాలుడు పీఠాధిపతిగా శంకర పరంపరలో పరివేష్టితులై, సత్యదండమును సదా తమతోనే ఉంచుకోవడానికై తమ నడుముకు కట్టుకుని నిద్రించి, ఆ పీఠమర్యాదను కాపాడిన ఆ బాలుడు ఈనాడు 'సత్యం'తో మమేకమైనారు. వారి బాల్యంలో గణపతిశాస్త్రిగారన్న గొప్ప పండితులు కావేరీనదీ తీరాన శంకరుల గీతాభాష్యమును స్వామివారికి నేర్పించే క్రమంలో, బాలుడైన స్వామివారు కర్రపుల్లతో ఒడ్డున ఏదో రాసుకుంటూ ఉండటంతో, బాలస్వామి పరధ్యానంలో ఉన్నారన్న శంకతో తర్వాత రోజు వారు వారి ఊరు వెళ్ళడానికి సిద్ధపడతారు.

అసంతృప్తిని వ్యక్తం చేసిన శాస్త్రిగారికి, వారు చెప్పిన పాఠము, అందులో ఏది శంకరులు చెప్పినది, ఏది సొంతంగా శాస్త్రిగారు చెప్పినది, ఒక్కమాట పొల్లుపోకుండా కంఠోపాఠంగా తిరిగి చెప్పారు స్వామివారు. అక్కడితో ఆగకుండా అద్వైతపరంగా, ఇంకా గీతాభాష్యానికి కొత్త సొబగులద్దుతూ



గణపతి శాస్త్రిగారికి నూత్న కోణాలను కూడా దర్శింపజేశారు. యువ శిష్యుడిగా (సాధకుడిగా) తన ముందు నిలిచిన ఆ బాలస్వామిని చూసి సాష్టాంగపడ్డారు శాస్త్రిగారు. ఆ పరమేశ్వరుడే చంద్రశేఖర సరస్వతీ స్వామిగా జన్మించారని గుర్తించారు.

**"జటాఝూటము విడనాడి, బాలచంద్రుని విడనాడి, గంగ వీడి మరియు గౌరి వీడి, భువిన వెలసినట్టి భవుడవు నీవంటు చంద్రశేఖరేంద్ర! సమ్యమీంద్ర"** అని ప్రణతులర్పించారు. ఇవి ఆనాటి వాక్కులు. 75వ వసంతంలో జరిగిన ఈ సంఘటన నాటి దృష్టాంతాన్ని దృఢపరుస్తుందో లేదో మీరే గమనించండి. స్వామివారు పూర్తిగా ఏకాంతంలో, మౌనంలో ఉన్న బ్రహ్మపురీశ్వర ఆలయంలోని ఒక గదిలో ధ్యానంలో ఉండగా వారి అవసరాలను గమనించుకునే ఆంతరంగికులు గదిలోనికి ప్రవేశించే క్రమంలో స్వామివారి ఒడిలో ఉన్న పామును చూసి నిశ్చేష్టులయ్యారు. ఎంతో సేపు కిటికీ మాటు నుండి స్వామివారు ధ్యానం విరమించే సమయం కోసం ఎదురు చూస్తూ ఉండి, వారిలో చలనం చూశాక చాలా మెల్లగా స్వామివారికి, పాము వారి ఒడిలో ఉందని తెలియజేశారు. ఆ సర్పమునకు ఎట్టి ఇబ్బంది కలుగకుండా స్వామివారు వారి వస్త్రమును సరిచేసుకోవడము, ఆ పాము వడివడిగా అక్కడ నుండి వెళ్ళిపోవడమూ జరిగాయి. "వారు నాలుగు రోజుల నుండి వచ్చి వెళుతున్నారు, మీరెందుకు హడావిడి చేస్తున్నారయ్యా" అన్న స్వామివారి శీతలమైన మాటలతో తెల్లమొహం వేశారు అంతేవాసులు. సర్వజీవులలోనూ ఆ సర్వసాక్షి అయిన భగవంతుడినే దర్శించగలిగిన ఆ మహాత్మునికి 'వేరన్న' భావమెక్కడిది, నిజమే! నాటి శాస్త్రిగారి వాక్కు. నాటి బాలుడే నేడు మనం చూస్తున్న నడయాడిన 'దైవం.' అవునందామా! ఇదిగో మరి ఈ అనుభవం చూడండి. మరల మాట్లాడుకుందాం.

కాశీయాత్ర పూర్తిచేసి మఠానికి తిరిగి వచ్చిన శ్రీవారిని కుప్పు సహాయం కోసమై అర్థించాడు. "నావద్ద ఏముంది? ధనమూ లేదు, మరేమీ లేదు. నేనేం చెయ్యగలను?" కుప్పు ప్రార్థన ఆపలేదు. శ్రీవారు తప్ప మరి దిక్కులేరన్నాడు. కుప్పు మంచి ప్రతిభాశాలి. చాలా భాషలు నేర్చినవాడు. డిగ్రీ పట్టా ఉందతనికి. ఒక్క రాత్రిలో శుద్ధ సంస్కృతంలో మహామాఘం ప్రాధాన్యత గురించి పద్యకావ్యం వ్రాశాడు. తమిళ, ఆంగ్లభాషలూ బాగా వచ్చు. చివరికి శ్రీవారి సిఫారసు మీద ఒక బ్యాంకులో ఉద్యోగం దొరికిందతనికి. ఒక సంవత్సరం గడిచిందేమో. శ్రీవారు తంజావూరులో విడిది చేస్తుండగా ఒకనాడు ఒక వ్యక్తి పూజ కోసం వేయించిన మంటపానికి దాదాపు బయట కూర్చుని కనిపించాడు.



చొక్కా వేసుకుని ఉన్నాడు. ధూమపానం చేస్తుండగా కూడా ఎవరో చూసారు. శ్రీవారు ఆ వ్యక్తిని తీసుకురమ్మన్నారు. ఆ మనిషి వచ్చేవాడిలాగా అనిపించలేదు. కానీ శ్రీవారి మాట జవదాటకూడదుగా. శ్రీవారి సహాయకులలో ఒకరు అతని దగ్గరకు వెళ్ళి శ్రీవారిని కలువవలసిందిగా కోరారు. అతడు వెంటనే వచ్చాడు.

"సరి అయిన దుస్తులు ధరించకపోవడం చేత రాలేదు" అన్నాడతను సంజాయిషీ చెప్పుకుంటూ. శ్రీవారు అతనితో కాసేపు మాటలాడి, కుప్పు గురించి అడిగారు. అతడు జవాబివ్వడానికి సందేహించాడు. కొంతసేపు అడిగిన తరువాత కూడా సరైన సమాధానం ఇవ్వలేదు. "అదేంటంటే... కుప్పు సెలవులో ఉన్నాడు". చివరికి, తడవ తడవలుగా మాకు ఈ వ్యక్తి ద్వారా తెలిసిందేంటంటే – కుప్పుకి బ్యాంకులో క్యాషియర్‌గా పని ఇచ్చారని, డబ్బు దొంగతనం చేయడం వల్ల తాత్కాలికంగా తొలగించారనీను. ఆ రోజు పూజ ముగిసిన తరువాత శ్రీవారు కుప్పువాళ్ళు గ్రామానికి వెడుతున్నానని ప్రకటించారు. "అదోచిన్న కుగ్రామం. మనందరినీ వాళ్ళు భరించలేకపోవచ్చు. పైగా ఇప్పటికిప్పుడు పీఠాన్ని తరలించలేము" అంటూ అసమ్మతి తెలిపారు మఠ కార్యనిర్వహణాధికారి. "పూజను తీసుకుని బయలుదేరుతున్నాను" అని ఆ గ్రామానికి బయలుదేరారు శ్రీవారు. అవసరానికి అందరూ ఏకమవడం తంజావూరువాసుల ప్రత్యేకత. రాత్రికి రాత్రి వాళ్ళు సరంజామా కూర్చుకుని మంటపాన్ని ఏర్పాటు చేసారు. పూజకూ ఇతర అవసరాలకు సామగ్రి సిద్ధం చేసారు. ఆ కుగ్రామాన్ని తిరునాళ్ళలాగా మార్చేసారు.

శ్రీవారి సంగతంటారా, వారు తిన్నగా కుప్పువాళ్ళ ఎదురింటికి వెళ్ళి అక్కడ కూర్చున్నారు. కుప్పు వాళ్ళింట్లో అటకెక్కి దుప్పటి ముసుగుతన్ని పడుకున్నాడు. రెండు రోజుల తరువాత మూడోరోజు మధ్యాహ్నం కుప్పు ఏం జరుగుతుందో చూడటానికి జాగ్రత్తగా బయటకు వచ్చాడు. శ్రీవారు కుప్పును పసిగట్టి, తీసుకురమ్మన్నారు. కొంతమంది వీధి దాటి అవతల ప్రక్కకు వెళ్ళి, ఒకటో రెండో దెబ్బలు వేసి కుప్పుని శ్రీవారి వద్దకు తీసుకువచ్చారు. కుప్పు వెంటనే సాష్టాంగం చేస్తూ శ్రీవారి పాదాలమీద పడ్డాడు. శ్రీవారివలే శరణాగతి చేసినవారిని క్షమించి రక్షించేవారెవరూ లేరు. తమ పాదాల వద్ద ఆశ్రయం కోరినవారిని రక్షించు ప్రతిజ్ఞలో శ్రీవారు సాక్షాత్తూ శ్రీరాముడే. శరణాగతవత్సలులు కదా!

కుప్పు సుమారు అయిదువేల రూపాయలు కాజేశారనుకుంటా. ఆ రోజుల్లో మఠంలో



భిక్షావందనమునకు పదమూడు రూపాయలు ఇవ్వవలసి ఉండేది. అయిదువేల రూపాయలు ఎంత పెద్ద సొమ్మో మీరు ఊహించుకోవచ్చు. ఇది నలభైల్లో సంగతి. శ్రీవారు కుప్పుని తిట్టలేదు, ఒక్కమాట అడగలేదు. మఠ కార్యనిర్వహణాధికారిని పిలిపించి బ్యాంకుకు ఆ డబ్బును కట్టివేయమన్నారు.

శ్రీవారు తరువాత తిరుచిరాపల్లిలో నేషనల్ కాలేజీ స్థలంలో విడిది చేసారు. ఆ రోజుల్లో ప్రతీ ఏటా చివరి 'రెండో శనివారం'నాడు ఉపాధ్యాయుల పరిషత్తు సమావేశం జరిగేది. అవి తెల్లదొరతనం రోజులు. శ్రీవారు కళాశాల అధ్యక్షుడితో మాట్లాడారు. "ఈ కుర్రాడికి డిగ్రీ పట్టా ఉంది, చాలా భాషలు వచ్చు. మీరు మీ పాఠశాలలో ఉద్యోగం ఇవ్వగలరా?"

"శ్రీవారి ఆదేశం. శ్రీవారు కోరుకుంటే పది ఉద్యోగాలు ఇవ్వగలను". అలా కుప్పు జీవితంలో మళ్ళీ స్థిరపడ్డాడు. అప్పుడప్పుడు దర్శనం కోసం వచ్చేవాడు. ఒక్కసారి కూడా శ్రీవారు కుప్పుతో ఆ సంఘటన గురించి మాట్లాడలేదు. శ్రీవారు తమ భాషలోకాని, ఇతరులతో తమ ప్రవర్తనలో కానీ ఎంతో ఉన్నతులు. జీవితపు చివరి రోజుల్లో కుప్పుకు తన మలమూత్రవిసర్జనపై అదుపు ఉండేది కాదు. అలాంటి పరిస్థితిలో చనిపోయినవారికి మరుజన్మ లేదంటారు. కుప్పు శ్రీవారి నుండి ఒక్క చీవాటూ ఎరుగడు.

గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా భావించి, ప్రార్థించే జాతికి వారసులం మనం. ఒక వంక ఈశ్వరుడుగా దర్శనమిస్తూనే మరోవంక ప్రతిమనిషిని సత్యపథం వైపుగా అడుగులు వేయించి, తాను మనతోనే, తాను మనతోడే అన్నట్లు వ్యవహరించే సద్గురువులు మనకు దొరకడం ఎన్ని జన్మల ఫలం. శ్రీసాయి జీవితచరిత్రలో ఎన్ని లీలా విశేషాలో, ఎన్ని జీవులకు సంస్కరణా సంవిధానాన్ని అందజేసిందో కదా శ్రీసాయి సన్నిధి. నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతీ సంఘటనకు సమాధానాన్ని ప్రసాదించిందో కదా వారి లీలా సంహిత. అదే శ్రీబాబూజీ మహరాజ్‌ను ఆశ్రయించుకున్న మనందరికీ లభించింది. 'సాయిదీవెన' బండ్లకొద్దీ మనందరి గడపగడపకూ చేరింది. వారు చూపిన సాయిబాట ఏది ఆచరించాల్సిన పథమో, ఏది ఆనంద జీవన నిర్వచనమో కంటికి కట్టినట్లు చూపింది. అసలైన సాయిబాటను రాచబాటగా చూపించడమేగాక వేలాదిమంది సాయిభక్తులను తరతరాలకు మార్గదర్శనం చేయిస్తూ బాబా చెప్పిన 'లక్షలాదిమంది శుభ్రమార్గాన' నడిచేందుకు ఊతమై నిలుస్తోంది. **గురువు**



అనుగ్రహ ఖజానాలో లోటుకు చోటేలేదు. బండ్లకొద్దీ ఇవ్వడానికి అనుగ్రహం(ఆనందం) సిద్ధం చేసే ఉంది. వలసిందల్లా మనలో ఆర్తి మాత్రమే! "నన్ను ఉపయోగ పెట్టుకోండయ్యా" అంటూ గురుదేవులెప్పుడో చెప్పారు. శాస్త్రషట్కాలు, మేధోవిన్యాసాలు, అర్థవంతంకాని ఆచారాలు, డాంబికంతో కూడిన మాటల మూటలు ఏవీ, మరేవీ మనకు సాయం చేయలేవు 'గమ్యం' చేరడానికి. కేవలం గురుస్మరణ, గురుదేవుల చరణాలు మాత్రమే మనందరకు 'దారి', అక్కున చేర్చుకుని లాలించే అమ్మ 'దరి'. ఆ పదద్వయమే నిత్య 'సిరి'. సద్గురు అనుగ్రహం 'పూర్ణం'గా మనందరిపై వర్షించాలని కోరుకుంటూ - శుభం భవతు -సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు.......

- గురుకృప

## అభిమానులమా? అనుయాయులమా?

మానవజన్మ లభించడమే దుర్లభమని శాస్త్రాలు చెప్పే మాట...
మరి మహాత్ముడు అవనికి వేంచేయడం ఎంతటి విశేషం?
గురుదేవుల జీవిత సమస్తము విశేషమే! ప్రతీ చర్య మానవ జీవన శ్రేయో పాఠమే!
వారి గురుదేవులకిచ్చిన మాటకై ప్రాణాలను సైతం లెక్కచేయక
సత్సంగం కోసం ఏరు దాటిన ధీరత్వం గురువుగారిది.
**ప్రాణాలు సరే! వ్యక్తిత్వ వికాస కేంద్రాలను**
**'వ్యక్తి' కేంద్రాలుగా మారకుండా జాగ్రత్త పడదాం...**
శ్రీసాయికి సమర్పించకుండా మంచినీళ్ళు కూడా స్వీకరించేవారు కారు గురువుగారు...
**పొందే ప్రతిదీ సద్గురు ప్రసాదమని భావిస్తూ అదిలేదు, ఇదిలేదు అనే ఫిర్యాదులు మానేద్దాం.**
గురుదేవుల జీవితం కేవలం ప్రేమను పొందడం, ప్రేమను పంచడంగానే వ్యక్తమయింది....
**అంతటి మహోన్నత వ్యక్తికి బిడ్డలుగా ద్వేషించడం మానేద్దాం.**
అభిమానులు గొప్పలు చెపుతుంటారు...
అనుయాయులు అడుగడుగు గురువును వ్యక్తం చేస్తుంటారు...
**ఆ పదాలను ఆచరించడం...**
**ఆ పాదాలను అనుసరించడం మన విధి...**

- గురుకృప

# స్వేచ్ఛ



ఏమిటి ఆ ఆకర్షణ
ఎందుకంత ఆరాధన?
పేర్లు, పదాలు ప్రక్కనబెట్టి
తెలిసినదంతా, తెలుసుకున్నదంతా ప్రక్కనపెట్టి
చూస్తే, కేవలం అలా చూస్తే
ఆయనలో కనిపించేది ఏదో
అంతరంగంలో స్ఫురణగా తెలుస్తోంది
ఆయనగా కనిపించేది ఏదో
మనస్సును ముగ్ధం చేస్తోంది
బహుశా అది స్వేచ్ఛ కావచ్చు
ఆయన ప్రతి కదలికలో వ్యక్తమైన స్వేచ్ఛ
ఎన్నడూ ఎవ్వరిమీదా ఆధారపడని స్వేచ్ఛ
ప్రతి ఆదర్శానికి మూలసూత్రమైన స్వేచ్ఛ
ప్రతి మాటలో ధ్వనించే స్వేచ్ఛ
ప్రతి పనిలో ప్రకటమయిన స్వేచ్ఛ
జీవించడంలో స్వేచ్ఛ
ఇక పొందాల్సిందంటూ ఏమీ లేని స్వేచ్ఛ
కోల్పోయేదంటూ ఏమీ మిగలని స్వేచ్ఛ
నిన్న, నేడు, రేపు లేని స్వేచ్ఛ
బాబా మీద ఆధారపడటంలో స్వేచ్ఛ
బాబా మీద ఆధారపడటం ద్వారా స్వేచ్ఛ
శరణాగతిలో కనిపించే స్వేచ్ఛ
శరణాగతిగా కనిపించిన స్వేచ్ఛ
కోరుకోవాల్సింది అదేనా
అందరి అంతరాళాలలో కోరిక అదేనా
ఎవరి సమాధానం వారిది.

– 'భీమ్', చెన్నై



**గురుబంధువు :** గురువుగారూ! ఈ నాలుగు రోజులూ ఆనందంగా ఉంది. చాలా హ్యాపీగా ఉంది. రేపో, ఎల్లుండో ఇక ఊరికి వెళ్ళాలి. ఒక భయమూ, ఆదుర్దా, ఇలా ఎన్నో... ఇక్కడి ఆనందం మటుకు అక్కడ గ్యారంటీగా ఉండదు. మేము అక్కడ కూడా ఇంతే ఆనందంగా ఉండాలంటే ఏం చెయ్యాలి? సత్సంగం, పారాయణ, భజన,.. ఇవి కాకుండా మా ఆలోచనా విధానం ఎట్లా ఉంటే మాకు హ్యాపీగా ఉంటుంది?

**గురువుగారు :** ఇక్కడి ఆనందాన్ని ఇక్కడ వదిలేసి వెళ్ళకండి. మీకు చేతనైనంత తీసుకెళ్ళండి. తీసుకెళ్ళి దాన్ని నిలుపుకునేటువంటి ప్రయత్నమే సత్సంగాలు. సత్సంగాలు అక్కడ ఎందుకు చేయాలి? నేనెందుకు మిమ్మల్నందర్నీ సత్సంగాలకు ఎక్కువ అటెండవ్వమని చెప్తానంటే, కారణం అదే. ఇక్కడుండే వాతావరణంలో కొంతభాగమైనా సరే, ఈ ఆనందాన్ని నిలుపుకొని జాగ్రత్త చేసుకోగలగాలి. ఆఫీసులో జీతం తీసుకున్నావు. జీతం తీసుకొని, ఆ జీతాన్ని ఎట్లా ఇంటికి తీసుకువెళ్ళి, సేఫ్‌లో పెట్టుకుంటావో.. మధ్యలో ఖర్చయ్యేది ఖర్చవుతుంటుంది. అది వేరే విషయం. అటువంటిది సత్సంగం అంటే. ఇక్కడకు వచ్చి రిసీవ్ చేసుకోవాలి. ఎంత తీసుకుపోగలిగితే అంత తీసుకుపోవాలి. దాన్ని నిలుపుకునే ప్రయత్నంలో మన వాతావరణాన్ని మనం తయారుచేసుకోవడం అనేటువంటిది సత్సంగం. కాబట్టి, తగ్గింది, మళ్ళా ఇంకోసారి రావాలి. అట్లా కొంతకాలం పోయేటప్పటికీ ఏమవుతుందంటే, ఈ మధ్యలో ఉండే గ్యాప్ తగ్గిపోతుంది. తగ్గిపోయి, అక్కడున్నా హ్యాపీగానే ఉంటుంది.

– సాయిపథం, శిరిడీ.


శ్వేతవస్త్రధరం
శ్రేష్ఠ మధురాధరవదనం..
సభక్తిపూర్వక
సాయినామస్మరణ ప్రసన్నం..
సుహిమలోచన భక్తజన
మనోప్రమోదం..
జగదానందకారకం
శరద్గురుదేవం..  శిరసానమామి..
www
gurukrupa.info
+91 83672 00045